క్రీడా కుసుమం -8లో

» భారత క్రికెట్ జట్టుకు ఎంపికైన కరుణ
» ప్రపంచ అంధుల టీ 20 టోర్నీలో ప్రాతినిధ్యం
» అంధ బాలికల ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థిని
» స్వగ్రామం అల్లూరి జిల్లా పాడేరు మండలం వంట్లమామిడి




# మహిళలకు ఆరోగ్య రక్ష

## నేటి నుంచి 'స్వస్థ నారీ సశక్త్ పరివార్ అభియాన్'

ప్రధాని నరేంద్రమోదీ జన్మదినం సందర్భంగా దేశవ్యాప్తంగా శ్రీకారం

» ఏయూ కన్వెన్షన్ సెంటర్‌లో ప్రారంభించనున్న సీఎం చంద్రబాబునాయుడు
» పక్షం రోజులపాటు పరీక్షల నిర్వహణకు ప్రత్యేక శిబిరాలు
» అనారోగ్య సమస్యలపై నిపుణులతో అవగాహన కలిగించే కార్యక్రమాలు
» ఆరోగ్యశాఖ సన్నద్ధం
» పదుల సంఖ్యలో వైద్యులు, సిబ్బంది నియామకం





విశాఖపట్నం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మహిళల ఆరోగ్య సంరక్షణే ధ్యేయంగా కేంద్ర ప్రభుత్వం 'స్వస్థ నారీ సశక్త్ పరివార్ అభియాన్' కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. దీని అమలును రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. బుధవారం ప్రధాని నరేంద్రమోదీ జన్మదినం సందర్భంగా దేశవ్యాప్తంగా ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నారు. అదే సమయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బీచ్‌రోడ్డులోని ఏయూ కన్వెన్షన్ సెంటర్‌లో ఈ ప్రోగ్రామ్‌ను ప్రారంభించనున్నారు. ఇందులో భాగంగా బుధవారం నుంచి వచ్చే నెల రెండో తేదీ వరకు పక్షం రోజులపాటు ప్రత్యేక వైద్య శిబిరాలను నిర్వహించి మహిళలకు వివిధ పరీక్షలు నిర్వహించనున్నారు. ఇందుకోసం ఆరోగ్య శాఖ పెద్దఎత్తున వైద్యులు, సిబ్బందిని కేటాయించింది. స్వస్థ నారీ సశక్త్ అభియాన్ పరివార్... అంటే ఆరోగ్యవంతమైన మహిళ-శక్తివంతమైన కుటుంబమని ఆరోగ్య శాఖ అధికారులు చెబుతున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా మహిళలకు ఆరోగ్యంపై అవగాహన పెంచడం, వైద్య సేవలు అందించడం, పోషకాహారాన్ని తీసుకునేలా ప్రోత్సహించడం, కుటుంబాలను అందుకు అనుగుణంగా సన్నద్ధం చేయడం చేస్తారు.

### మహిళలకు చేకూరనున్న మేలు

ఈ ప్రోగ్రామ్‌లో భాగంగా మహిళలకు గుండె జబ్బులు, మధుమేహం, నోటి క్యాన్సర్, గర్భాశయ ముఖ ద్వార క్యాన్సర్, తదితర పరీక్షలు నిర్వహిస్తారు. అవసరమైన వారికి మెరుగైన వైద్య సేవలను అందిస్తారు. మహిళలు, కిశోర బాలికల్లో రక్తహీనతను గుర్తించి తగిన చికిత్స అందిస్తారు. గర్భిణులకు పరీక్షలు నిర్వహించి పోషకాహారం ఆవశ్యకతను తెలియజేస్తారు. కిశోర బాలికలకు హిమోగ్లోబిన్, రక్తహీనత వంటి సమస్యలు ఉంటే వారికి అవసరమైన వైద్య సేవలను అందించేలా చర్యలు చేపడతారు. పిల్లల్లో సికిల్‌సెల్ ఎనీమియా వంటి ఇబ్బందులు ఉంటే రిఫరల్ ఆస్పత్రులకు పంపిస్తారు. పిల్లలకు, గర్భిణులకు వ్యాధి నిరోధక టీకాలను అందించనున్నారు. రక్తదాన శిబిరాలు నిర్వహించడం, ఆయుష్మాన్ ఆరోగ్య కార్డులను పంపిణీ చేయడం, ఇతర వ్యాధులపై అవగాహన కలిగించేలా ఈ ప్రత్యేక వైద్య శిబిరాలు కొనసాగుతాయి.

### ప్రత్యేక వైద్య శిబిరాలు ఎక్కడంటే..?

పట్టణ, గ్రామీణ ఆరోగ్య కేంద్రాలు, ఏరియా ఆస్పత్రులు, సామాజిక ఆరోగ్య కేంద్రాలు, విలేజ్ హెల్త్ క్లినిక్స్‌లో ఈ ప్రత్యేక శిబిరాలను నిర్వహించనున్నారు. ఇందులో వైద్య, ఆరోగ్య

... మిగతా 6వ పేజీలో


### మహిళ ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబానికి భరోసా



- డాక్టర్ పి.జగదీశ్వరరావు, జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి

మహిళ ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబానికి భరోసా లభిస్తుంది. ఆ కుటుంబం కూడా ఆరోగ్యంగా ఉంటుంది. ఇదే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ఈ కార్యక్రమానికి పిలుపునిచ్చింది. 15 రోజులపాటు ప్రత్యేకంగా వైద్య శిబిరాలు నిర్వహించి మహిళలకు వివిధ రకాల ఆరోగ్య పరీక్షలు నిర్వహించనున్నారు. వారికి ఆరోగ్యం పట్ల అవగాహన కూడా కలిగించేలా ఈ శిబిరాలు నిర్వహిస్తాం. ఏయూ కన్వెన్షన్ సెంటర్‌లో బుధవారం సీఎం చంద్రబాబునాయుడు చేతుల మీదుగా ఈ ప్రోగ్రామ్ ప్రారంభం కానుంది. మూడు వేల మంది మహిళలకు పరీక్షలు నిర్వహిస్తాం. ఇందుకోసం 22 మంది స్పెషలిస్టు వైద్యులు, 18 మంది ప్రోగ్రామ్ ఆఫీసర్లు, 20 మంది స్టాఫ్ నర్సులు, ఐదుగురు ఫార్మసిస్టులు, నలుగురు ల్యాబ్ టెక్నీషియన్లు, 50 మంది ఇతర సిబ్బంది, మరో 15 కియోస్కులు ఏర్పాటు చేశాం.

# నేడు సీఎం రాక



» తొలుత సాగరిక ఫంక్షన్ హాలులో విమెన్ అండ్ చిల్డ్రన్ హెల్త్ స్క్రీనింగ్ కార్యక్రమం ప్రారంభం
» అనంతరం ఏయూ కన్వెన్షన్ సెంటర్‌లో 'స్వస్థ నారీ సశక్త్ పరివార్ అభియాన్' కార్యక్రమానికి శ్రీకారం
» సాయంత్రం రాడిసన్ బ్లూ హోటల్‌లో జరగనున్న గ్లోబల్ కేపబులిటీ సెంటర్ వ్యాపార సదస్సుకు హాజరు

విశాఖపట్నం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు బుధవారం విశాఖపట్నం వస్తున్నారు. విజయవాడ నుంచి ఉదయం 10.10 గంటలకు హెలికాప్టర్‌లో బయలుదేరి 11.05 గంటలకు విశాఖపట్నం విమానాశ్రయంలో దిగుతారు. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో ఆర్‌కే బీచ్ రోడ్డులోని ఏయూ సాగరిక ఫంక్షన్ హాలుకు 11.25 గంటలకు చేరుకుంటారు. విమెన్ అండ్ చిల్డ్రన్ హెల్త్ స్క్రీనింగ్ కార్యక్రమంలో పాల్గొంటారు. అది పూర్తయిన తరువాత 12 గంటలకు ఏయూ కన్వెన్షన్ సెంటర్‌కు చేరుకొని అక్కడ నిర్వహించే 'స్వస్థ నారీ సశక్త్ పరివార్ అభియాన్' కార్యక్రమంలో పాల్గొంటారు. అక్కడ 1.45 గంటల వరకూ ఉంటారు. ఆ తరువాత మధ్యాహ్నం 2.45 గంటల వరకూ విశ్రాంతి తీసుకుని, రుషికొండలోని రాడీసన్ బ్లూ హోటల్‌కు వెళతారు. కేంద్ర ఆర్థిక

... మిగతా 6వ పేజీలో

# పేదల ఇళ్ల కాలనీల్లో తాగునీటికి రూ.640 కోట్లు

ప్రభుత్వానికి ప్రతిపాదనలు

» పంచ గ్రామాల భూ సమస్యకు సాధ్యమైనంత వేగంగా పరిష్కారం
» ప్రత్యామ్నాయంగా దేవస్థానానికి గాజువాకలో భూములు



సదస్సులో పాల్గొన్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్, సీపీ శంఖబ్రత బాగ్చీ

» కోర్టులో అఫిడవిట్ దాఖలు
» ప్రభుత్వ భూముల్లో ఆక్రమణల క్రమబద్ధీకరణకు చర్యలు
» లక్ష్యం మేరకు వృద్ధి రేటు
» కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్
» పోలీస్ కమిషనర్‌కు సీఎం అభినందన

విశాఖపట్నం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): నగర శివారు ప్రాంతాల్లో నిర్మాణంలో ఉన్న 73 ఇళ్ల కాలనీల్లో తాగునీటి కల్పనకు రూ.640 కోట్లతో ప్రతిపాదనలు రూపొందించి ప్రభుత్వానికి పంపినట్టు జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ తెలిపారు.

అమరావతిలో జరుగుతున్న కలెక్టర్ల సదస్సులో రెండో రోజు మంగళవారం విశాఖ జిల్లాకు సంబంధించి కొత్తగా నిర్మిస్తున్న ఇళ్ల కాలనీల్లో నీటి సదుపాయం, పంచ గ్రామాల భూ సమస్య, ఆక్రమణల క్రమబద్ధీకరణ, ఆర్థిక వృద్ధి రేటు, తదితర అంశాలను సీఎం చంద్రబాబునాయుడు ప్రస్తావించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ శివారు ప్రాంతాల్లో నిర్మిస్తున్న ఇళ్ల కాలనీలకు బయట నుంచి పైప్‌లైన్ల ద్వారా నీటిని తీసుకురావాల్సి ఉందని పేర్కొంటూ అందుకు రూ.640 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామన్నారు. నగర పరిధిలోని లేఅవుట్లకు అమృత్, గ్రామీణ ప్రాంత లేఅవుట్లకు జలజీవన్ మిషన్ పథకం అమలు చేయాలన్నారు. అలాగే దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న పంచ గ్రామాల సమస్యను సాధ్యమైనంత వేగంగా పరిష్కరించేందుకు కోర్టులో అఫిడవిట్ దాఖలు చేశామన్నారు. పంచ గ్రామాల్లో సుమారు 12,190 ఆక్రమణలు ఉన్నాయన్నారు. ఆక్రమణదారులు ఉన్న భూమికి సమాన విలువ కలిగిన భూములను గాజువాక మండలంలో గుర్తించినట్టు కలెక్టర్ వెల్లడించారు.

నగరంలో ప్రభుత్వ భూముల్లో ఆక్రమణల క్రమబద్ధీకరణకు సంబంధించి జీవోలు 35, 40 ప్రకారం వేగంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఆక్రమణలను త్వరితగతిన రెగ్యులర్ చేసేలా క్షేత్రస్థాయిలో చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. లక్ష్యాలకు అనుగుణంగా

... మిగతా 6వ పేజీలో

# ఆటో డ్రైవర్లకు భరోసా

» ప్రతి ఒక్కరికీ రూ.15 వేల ఆర్థిక సాయం
» నేటి నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ
» 19వ తేదీ వరకే గడువు
» 22వ తేదీన క్షేత్రస్థాయిలో పరిశీలన
» 24న అర్హుల జాబితా విడుదల
» దసరా పండుగనాడు డ్రైవర్ల బ్యాంకు ఖాతాల్లో నగదు జమ



లబ్ధి పొందనున్న ఆటో డ్రైవర్లు(ఫైల్ ఫొటో)

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు ఆటో నడుపుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్న వారికి ఆర్థిక భరోసా కల్పించేందుకు కూటమి ప్రభుత్వం ముందుకువచ్చింది. అర్హులైన ఆటో కార్మికులకు రూ.15 వేల చొప్పున దసరా పండుగ రోజున బ్యాంకు ఖాతాల్లో జమ చేయనుంది. ఇందుకోసం బుధవారం నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని అధికారులు వెల్లడించారు. ప్రభుత్వ ప్రకటనపై ఆటో డ్రైవర్లు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

స్త్రీశక్తి పథకం కింద ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సదుపాయం కల్పించడంతో ఆటోలను ఆశ్రయించే ప్రయాణికులు తగ్గిపోయి, ఆదాయాన్ని కోల్పోతున్న ఆటో డ్రైవర్లకు ఆర్థిక భరోసా కల్పించనున్నట్టు సీఎం చంద్రబాబునాయుడు ఇటీవల అనంతపురంలో నిర్వహించిన 'సూపర్ సిక్స్- సూపర్‌హిట్' సభలో ప్రకటించిన సంగతి తెలిసిందే. రవాణా శాఖ గణాంకాల ప్రకారం జిల్లాలో సుమారు 40 వేల ఆటోలు ఉన్నాయి. గత ప్రభుత్వం ఆటో డ్రైవర్లకు వాహన మిత్ర పేరుతో ఏటా రూ.10 వేలు మాత్రమే అందించింది. కూటమి ప్రభుత్వం మరో 50 శాతం అధికంగా..

... మిగతా 6వ పేజీలో



సింగపూర్‌లోని సెంతోశా ఐల్యాండ్‌లో విశాఖ ఎంపీ శ్రీభరత్ పర్యటన

# విశాఖలో సింగపూర్ తరహా పర్యాటక అభివృద్ధి

» సెంతోశా ఐల్యాండ్‌ను సందర్శించి అభివృద్ధి, నిర్వహణకు వారు అనుసరిస్తున్న విధానాలపై చర్చ
» సస్టెయినబుల్ టూరిజం విధానాలు, ప్రమాణాలు, వ్యర్థాల నిర్వహణ, నీటి సంరక్షణ వంటివి పరిశీలన

విశాఖపట్నం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలో పర్యాటక అభివృద్ధికి సింగపూర్ తరహా చర్యలు చేపట్టనున్నట్టు ఎంపీ ఎం.శ్రీభరత్ పేర్కొన్నారు. ఇందుకు అవసరమైన వ్యూహాలు, నమూనాల కోసం ఆయన సింగపూర్ పర్యటనకు వెళ్లారు. సెంతోశా ఐల్యాండ్‌ను మంగళవారం సందర్శించారు. అక్కడి బీచ్‌లు, ఎంటర్‌టైన్‌మెంట్ హబ్‌లు, ఆధునిక వసతులు పరిశీలించారు. ఏటా లక్షలాది మంది పర్యాటకులు వస్తున్న సెంతోశా ఐల్యాండ్ అభివృద్ధికి చేపట్టిన చర్యలు, వారు అనుసరిస్తున్న విధానాలు అడిగి తెలుసుకున్నారు. అంతర్జాతీయ ఉత్సవాల నిర్వహణ, పర్యాటకులను ఆకర్షించే అంశాలు, భద్రతా ప్రమాణాలు వంటి అంశాలపై వారితో చర్చించారు. విశాఖలో పర్యాటక అభివృద్ధికి

... మిగతా 6వ పేజీలో

# నాలుగు కళాశాలలపై కొరడా

» నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన కాలేజీలకు షోకాజ్ నోటీస్‌లు ఇచ్చిన ఏయూ అధికారులు
» జాబితాలో రెండు బీఈడీ, రెండు లా కాలేజీలు



ఏయూ వీసీ జీపీ రాజశేఖర్

విశాఖపట్నం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయం పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న బీఈడీ, లా కాలేజీలపై అధికారులు చర్యలు చేపట్టారు. రికార్డుల నిర్వహణ సరిగా లేని నాలుగు కాలేజీలకు షోకాజ్ నోటీసులు జారీచేశారు. ద్వారకానగర్‌లోని ఆల్ సెయింట్ క్రిస్టియన్ లా కాలేజీ, భీమిలిలోని విశాఖ లా కాలేజీ, మధురవాడలోని ప్రేమ బీఈడీ కాలేజీ, విజయనగరం జిల్లా చీపురుపల్లిలోని సెయింట్ మేరీ కాలేజీ ఆఫ్ ఎడ్యుకేషన్‌కు షోకాజ్ నోటీసులు జారీ చేసి వారం రోజుల్లోగా వివరణ ఇవ్వాలని ఆదేశించారు. రానున్న రోజుల్లో మిగిలిన కాలేజీల్లోనూ తనిఖీలు చేపడతామని, అనుబంధ కాలేజీలు నిబంధనల మేరకు సదుపాయాలు, వసతులు, ఫ్యాకల్టీ ఉండేలా చూసుకోవాలని, లేకపోతే చర్యలు తప్పవని అధికారులు హెచ్చరిస్తున్నారు.

### ఇవీ గుర్తించిన లోపాలు..

ద్వారకా నగర్‌లోని ఆల్ సెయింట్ క్రిస్టియన్ లా కాలేజీని ఏయూ వీసీ జీపీ రాజశేఖర్, సీడీసీ డీన్ టీవీ కృష్ణ, ఇతర అధికారులు ఈ నెల తొమ్మిదో తేదీన తనిఖీ చేశారు. ఆ కాలేజీలో 160 మంది విద్యార్థులకు ప్రవేశాలు కల్పించినట్టు నిర్వాహకులు చూపించారు. అయితే అధికారుల

... మిగతా 6వ పేజీలో



భీమన్నదొరపాలెంలో కొండవాలు ప్రాంతాన్ని ప్రొక్లెయినర్‌తో చదునుచేస్తున్న దృశ్యం

# కొండవాలుపై కన్ను

» వారం రోజులుగా చెట్లు, పొదలు తొలగించి చదును చేస్తున్న పెద్దలు
» పట్టించుకోని రెవెన్యూ సిబ్బంది

విశాఖపట్నం/ఆనందపురం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఆనందపురం మండలం భీమన్నదొరపాలెంలో ప్రభుత్వానికి చెందిన కొండవాలు భూమిని ఆక్రమించుకునేందుకు కొందరు రంగం సిద్ధం చేస్తున్నారు. వారం నుంచి యంత్రాలను ఉపయోగించి సుమారు పది ఎకరాల మేర చదును చేశారు. ఆ భూమి విలువ సుమారు రూ.50 కోట్లు ఉంటుందని అంచనా. భీమన్నదొరపాలెం సమీపాన ఎల్‌పీఎం నంబర్-1509 (పాత సర్వే నంబరు 156)లో 175.041 ఎకరాల విస్తీర్ణంలో కొండ ఉంది. దానిని 22 (ఎ)లో పొందుపరిచారు. భూమి

... మిగతా 6వ పేజీలో

# సెంట్రల్ ఎక్సైజ్ సూపరింటెండెంట్‌కు జైలు శిక్ష

» చీటింగ్ కేసులో మరొకరికి కూడా..
» ఇద్దరికీ కలిపి రూ.5.53 లక్షల జరిమానా
» రూ.32కోట్ల ప్రభుత్వాదాయానికి గండికొట్టినట్టు నిర్ధారణ
» విశాఖ సీబీఐ కోర్టు ప్రత్యేక న్యాయాధికారి తీర్పు

విశాఖపట్నం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): తప్పుడు పత్రాలతో కేంద్ర ప్రభుత్వ ఆదాయానికి గండికొట్టిన సెంట్రల్ ఎక్సైజ్ అండ్ కస్టమ్స్ శాఖ సూపరింటెండెంట్‌తోపాటు మరొకరికి ఐదేళ్ల జైలు శిక్షతోపాటు ఇద్దరికీ కలిపి రూ.5.53 లక్షల జరిమానా విధిస్తూ విశాఖలోని సీబీఐ కేసుల కోర్టు ప్రత్యేక న్యాయాధికారి సీఎస్ మూర్తి మంగళవారం తీర్పు వెలువరించారు. దీనికి సంబంధించిన వివరాలను సీబీఐ డీఐజీ కార్యాలయం మంగళవారం ఒక ప్రకటన ద్వారా విడుదల చేసింది. ప్రస్తుతం విశాఖపట్నం సెంట్రల్ ఎక్సైజ్ అండ్ కస్టమ్స్ అసిస్టెంట్ కమిషనర్ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న కలకల రాందాసు.. గతంలో శ్రీకాకుళం రేంజ్ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా పనిచేశారు. ఆ సమయంలో శ్రీకాకుళం జిల్లా కుశాలపురానికి చెందిన పోలాకి జానకిరామ్‌తో కలిసి కుట్రకు ప్రణాళిక రచించి అమలుచేశారు. అసలు ఉనికిలోనే లేని పి.కేశవరావు అనే పేరుతో జానకిరామ్‌ను కస్టమ్స్ అధికారులకు పరిచయం చేశారు. కేశవరావుపేరుతో గుర్తింపు పత్రాలను సృష్టించి వాటి ఆధారంగా శ్రీబాలాజీ జనరల్ ట్రేడింగ్ కంపెనీని స్థాపించారు. ఆ కంపెనీకి విదేశాల నుంచి ఎగుమతి, దిగుమతులు చేసుకునేందుకు

... మిగతా 6వ పేజీలో

## నేడు వైద్య శిబిరం

తగరపువలస, సెప్టెంబర్ 16 (ఆంధ్రజ్యోతి) : తగరపువలస అర్బన్ హెల్త్ సెంటర్‌లో బుధవారంఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు నిర్వహించనున్నట్టు 1వ వార్డు క్లస్టర్ ఇన్‌చార్జి పిట్ట సురేష్ తెలిపారు. రక్తపోటు, మధుమేహం నోటి క్యాన్సర్, రొమ్ముక్యాన్సర్, గర్భాశయ క్యాన్సర్ వంటి వాటిని పరీక్షించడానికి ప్రత్యేక వైద్యులు వస్తున్నారని అన్నారు.ఈ కార్యక్రమానికి వైద్య సిబ్బంది ద్వారా, అంగన్‌వాడీ జీవీఎంసీ సిబ్బంది తదితరులు హాజరవుతున్నారని అన్నారు. వైద్య పరీక్షల కోసం వచ్చే వారు ఆధార్ కార్డుతో హాజరుకావాలని కోరారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

## విద్యార్థుల స్వచ్ఛత ప్రతిజ్ఞ

తగరపువలస, సెప్టెంబర్ 16 (ఆంధ్రజ్యోతి) చిట్టివలస అంబేడ్కర్ జీవీఎంసీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రధానోపాధ్యాయుడు వైఎస్ స్వామి ఆధ్వర్యంలో మంగళవారం సామూహికంగా స్వచ్ఛత ప్రతిజ్ఞ నిర్వహించారు. ఈ నెల 30 వరకు పదిహేను రోజుల పాటు ప్రతిరోజూ స్వచ్ఛత సేవా కార్యక్రమాలను నిర్వహిస్తామని, పాఠశాలను పరిశుభ్రంగా ఉంచుతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రమీల, సునీత, రాజ్యలక్ష్మి, బలరాం, మహేశ్వరరావు, విశ్వేశ్వరరావు, ఆర్.అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

## వార్డుల పునర్విభజన కోసం నేతల ఎదురుచూపు

మధురవాడ, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ పరిధిలో వార్డుల పునర్విభజన కోసం మధురవాడ, పరిసర ప్రాంత నాయకులు ఎదురుచూస్తున్నారు. ఈసీ ఆదేశాలు మేరకు వచ్చేనెల 15లోగా వార్డుల విభజన చేపట్టవలసి ఉంది.విభజన జరిగితే వాటిఆధారంగా వార్డుల సంఖ్య కూడా పెరుగుతుంది.ప్రస్తుతం 5వ వార్డులో సుమారు 34,000, 6 వ వార్డులో 46,000, 7 వ వార్డులో 32,000 మంది ఓటర్లు ఉన్నారు. నిబంధనలు ప్రకా రం ఒక వార్డులో 20 నుండి 25 వేలమంది ఓటర్లు ఉండాలి. దీనికి అనుగుణంగా పునర్విభజన జరిగితే 5, 7 వార్డులుకు మరో వార్డు కలసి అవి రెండూ 3 వార్డులు అవుతాయి.6 వ వార్డు ఒక్కటే రెండు వార్డులుగా విభజిస్తారని నేతల ఊహాగానాలు వినపడుతున్నాయి.

# ఓజోన్ పరిరక్షణపై అవగాహనతో మెలగాలి

- విద్యాసంస్థల్లో అవగాహన సదస్సులు
- భీమునిపట్నంలో అవగాహన ర్యాలీ, మానవహారం



గొడుగులు పట్టుకొని ర్యాలీ నిర్వహిస్తున్న భీమిలి డైట్ లెక్చరర్లు, సిబ్బంది



తగరపువలస : మాట్లాడుతున్న ప్రభుత్వ డిగ్రీకళాశాల ప్రిన్సిపాల్ డా.పి.శ్రీవాణి

భీమునిపట్నం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మానవ జీవన కవచంగా ఉన్న ఓజోన్ పొరను పరిరక్షించుకోవాల్సిన ఆవశ్యకతపై అందరూ అవగాహన పెంపొందించుకోవాలని ప్రభుత్వ జిల్లా విద్యా శిక్షణా సంస్థ డైట్ ప్రిన్సిపాల్ ఎల్.సుధాకర్ పేర్కొన్నారు. అంతర్జాతీయ ఓజోన్ దినోత్సవాన్ని మంగళవారం స్థానిక డైట్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఛాత్రోపాధ్యాయులు రంగురంగుల గొడుగులతో పట్టణ పురవీధుల్లో ఛత్ర ర్యాలీ నిర్వహించారు. ఓజోన్ పొరను కాపాడుకోవడానికి ప్రతీ ఒక్కరూ చెట్లను నాటి పర్యావరణాన్ని సంరక్షించుకోవాలన్నారు. భావి తరాలకు సురక్షితమైన పర్యావరణాన్ని అందించడంలో అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అలాగే, డైట్ లెక్చరర్ జీజీఎస్ నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించుకొని పచ్చదనాన్ని, పెంచితే కాలుష్యం తగ్గి ఓజోన్ పరిరక్షించుకోగలమని గమనించాలన్నారు. మానవాళి మనుగడకు ఓజోన్ పొర ప్రాధాన్యంపై కాబోయే ఉపాధ్యాయులుగా మీరందరూ సమాజంలో పర్యావరణ చైతన్యాన్ని కలిగించడంలో బాధ్యతాయుతంగా మెలగాలన్నారు. ఈ సందర్భంగా గంటస్తంభం వద్ద ఓజోన్ పరిరక్షణ చైతన్య మానవహారాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో డైట్ లెక్చరర్ అల్లావుద్దీన్, లెక్చరర్లు పాల్గొన్నారు.

### తగరపువలసలో..

తగరపువలస, సెప్టెంబర్ 16 (ఆంధ్రజ్యోతి) : పర్యావరణ పరిరక్షణకు ఎంతో ఉపయోగపడడే ఓజోన్ పొర రక్షణ కోసం ప్రతివారు చిత్తశుద్ధితో కృషి చేయాలని తగరపువలస ప్రభుత్వ డిగ్రీకళాశాల ప్రిన్సిపాల్ డా.పి.శ్రీవాణి పేర్కొన్నారు. అంతర్జాతీయ ఓజోన్ పొర పరిరక్షణ దినోత్సవం సందర్భంగా మంగళవారం తగరపువలసలో విద్యార్థులు, విద్యావేత్తలు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ శ్రీవాణి మాట్లాడుతూ.. అనేక రసాయనాలు ఓజోన్ పొరకు తీవ్ర హానిని కలగజేస్తున్నాయని, రసాయనాల వినియోగాన్ని తగ్గిస్తే పరిరక్షించిన వారమవుతాయన్నారు. ఓజోన్ పొరను రక్షించడం కోసం మాంట్రియల్ ప్రొటోకాల్ పాటించాలని ఇందుకోసం ప్రతివారు పర్యావరణంపై అవగాహన పెంచుకోవాలని కోరారు. ఇందుకోసం అనేక రసాయనాలకు ప్రత్యామ్నాయంగా సీఎఫ్‌సి, హాలోకార్బన్ వంటి ఓజోన్‌ను క్షీణింపజేసే రసాయనాలకు ప్రత్యామ్నాయాలను కనుగొనాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థులు ఈ విషయంలో అప్రమత్తంగా ఉండి మొక్కల పెంపకం, ఇతర ప్రత్యామ్నాయ చర్యలకు కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నమూనాలను ప్రదర్శించి వాతావరణ పొరలు ఏ విధంగా ఓజోన్ ఉనికిని దెబ్బతీస్తాయో తెలియజేశారు. కార్యక్రమంలో డాక్టర్ బి.సుధాంసు ప్రభాకర్ పాల్గొన్నారు.

## ఆకట్టుకున్న స్పేస్ ట్రిప్ ప్లానిటోరియం


ప్లానిటోరియం వద్ద విద్యార్థులు

భీమునిపట్నం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : భీమిలి సెయింట్ ఆన్స్ స్కూల్‌లో మంగళవారం జరిగిన స్పేస్ ట్రిప్ ప్లానిటోరియం విద్యార్థులనుఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో మొబైల్ ప్లానిటోరియంలో భూ భ్రమణం, అగ్ని పర్వతాల విస్ఫోటనం, మోల్కీవే, డైనోసార్లు అంతరించిన విధానం, అంతరిక్షంలో వ్యోమగామల ప్రయాణం, పీఎస్ఎల్వీ, ఎస్ఎల్వీ రాకెట్లు వంటి ఎన్నో అద్భుతాలను 3డి ఎఫెక్ట్‌లో ప్రదర్శించారు. వీటిని చూసిన విద్యార్థులు ప్రత్యక్ష అనుభవం పొందినట్టు సంతృప్తి వ్యక్తం చేసినట్టు పాఠశాల ప్రిన్సిపాల్ సిస్టర్ క్రిస్టీ జాన్, సిస్టర్ ట్రెసా మేరీ తెలిపారు. విద్యార్థులకు స్పేస్‌పై అవగాహన వికాసం కలిగేలా స్ఫూర్తిదాయకమైన జ్ఞానాన్ని అందించాలన్న ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## 19న నారీ సశక్త్ పరివార్

భీమునిపట్నం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రంలో స్వస్త్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఈనెల 19న వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్టు సీహెచ్‌సీ మెడికల్ ఆఫీసరు డాక్టర్ ఫణికుమార్ తెలిపారు. శుక్రవారం ఉదయం ఆస్పత్రి ఆవరణలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ ఈ శిబిరం కొనసాగుతుందన్నారు. ఈ శిబిరంలో స్త్రీలు, పిల్లలు, కౌమార దశ బాలికలు, బాలురకు వైద్య సేవలు అందిస్తామన్నారు.

## మెగా డీఎస్సీలో పొరపాట్లు సవరించాలి

భీమునిపట్నం (రూరల్) సెప్టెంబర్ 16 (ఆంధ్రజ్యోతి) : మెగా డీఎస్సీలో ఉపాధ్యాయ ఉద్యోగాలు పొందిన కొన్ని కేటగిరిల అభ్యర్థులు సమర్పించిన కులధ్రువీరణ పత్రాలను పునర్‌పరిశీలించాలని జిల్లా కలెక్టర్ హరింధరప్రసాద్‌కు ఉపాధ్యాయుడు బి.గణేష్‌కుమార్ పిర్యాదు చేశారు.ఈ సందర్భంగా గణేశ్‌కుమార్ విలేకరులతో మాట్లాడుతూ.. చాలామంది ఓసీకి చెందిన వారు బీసీ ఏ కుల ధ్రువీకరణ పత్రా లు దఖలుపరిచి ఉపాధ్యాయ ఉద్యోగాలను పొందారన్నారు. ఆ వివరాలను కలెక్టర్‌కు అం దించిన ఫిర్యాదుతో అందజేసినట్టు చెప్పారు. రెడ్డి కులం ఓసీగా కాగా, చాలా మంది రెడ్డిక అని పెట్టుకుని బీసీ ఏ సర్టిఫికెట్లు తీసుకున్నారని, వారి కారణంగా చాలామంది అసలైన బీసీ ఏ అభ్యర్థులకు అన్యాయం జగిగిందన్నారు. జిల్లాలో స్కూలు అసిస్టెంట్ విభాగంలో 139 పోస్టుల్లో 39 ఓపెన్ కేటగిరిలో ఉన్నాయని, వీటిలో మూడు పోస్టులు అర్హులు లేనందువల్ల బీసీ కేటగిరిలో చేర్చారన్నారు. ఈ విధంగా చేర్చడం వల్ల తప్పుడు కుల ధ్రువీకరణ పత్రాలు సమర్పించి కొందరు ఈ పోస్టులను పొందారని అన్నారు.

## మహిళలకు ఆరోగ్య రక్ష

... 5వ పేజీ తరువాయి

శాఖ, మహిళా శిశు సంక్షేమ, పంచాయతీరాజ్, మునిసిపల్, డీఆర్‌డీఏ, విద్యా శాఖ అధికారుల సహకారం, సమన్వయంతో ఈ ప్రోగ్రామ్‌ను అమలు చేయనున్నారు. ఈ పరీక్షల నిర్వహణకు జిల్లాలో 135 క్యాంపులను నిర్వహించనున్నారు. ఆయా క్యాంపుల్లో 10,56,000 మంది మహిళలకు పరీక్షలు నిర్వహించేలా అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఇందుకోసం 236 మంది స్పెషలిస్టు వైద్యులను కేటాయించారు. మరో 20 మంది ప్రాజెక్టు ఆఫీసర్లు, 159 మంది స్టాఫ్ నర్సులు, 75 మంది ఫార్మసిస్టులు, 75 మంది ల్యాబ్ టెక్నీషియన్స్‌ను నియమించారు.

## అంధుల క్రికెట్ క్రీడాకారిణి కరుణకు అభినందనలు

సాగర్‌నగర్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ అంధుల మహిళా టీ-20 క్రికెట్ పోటీలకు ఎంపికైన పి.కరుణను మంగళవారం బీచ్‌రోడ్డులో గల అంధ బాలికల ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో పారిశ్రామికవేత్త, సామాజిక కార్యకర్త కమల్ బైద్ అభినందించారు.

## నేటి నుంచి స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్

రేవిడి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కె.లీలాప్రసాద్

పద్మనాభం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త ఆధ్వర్యంలో కుటుంబ సంక్షేమశాఖ నేతృత్వంలో మహిళల ఆరోగ్య పరిరక్షణ కోసం బుధవారం నుంచి స్వస్థనారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు రేవిడి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కె.లీలాప్రసాద్ తెలిపారు. 'ఆరోగ్యవంతమైన మహిళ-శక్తివంతమైన కుటుంబం' అనే నినాదంతో బుధవారం నుంచి అక్టోబరు 2 వరకు పీహెచ్‌సీ పరిధిలోని ఆరోగ్య ఉప కేంద్రాల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. బుధవారం పీహెచ్‌సీలో ఈ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, ఇతర ప్రజాప్రతినిధులు ప్రారంభిస్తారన్నారు. ఈ కార్యక్రమం ద్వారా మహిళల ఆరోగ్య పరిరక్షణ కోసం వైద్య శిబిరాల నిర్వహణ, పోషకాహారంపై అవగాహన కల్పించడం, వారు ఎదుర్కొంటున్న ఆరోగ్య సమస్యలను గుర్తించడం జరుగుతుందన్నారు.ఇందులో భాగంగా 18న పొట్నూరు, 19న కొవ్వాడ, 20న బాందేవపురం, 22న మద్ది, 23న గంధవరం,24న అనంతవరం, 25న నేరేళ్లవలస, 26న పద్మనాభం, 27న పాండ్రంగి, 29న కృష్ణాపురం, అక్టోబరు 1న తునివలసల్లోని హెల్త్ అండ్ వెల్‌నెస్ కేంద్రాల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని పేర్కొన్నారు.


కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

## వైభవంగా అప్పన్న కల్యాణం

సింహాచలం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): సింహాద్రి అప్పన్న స్వామి ఆర్జిత నిత్యకల్యాణాన్ని మంగళవారం వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాత సేవతో మేల్కొలిపి ప్రభాతారాధనలను యథావిధిగా జరిపాక ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించాక పాంచరాత్రాగమ శాస్త్ర విధానంలో కల్యాణాన్ని నిర్వహించారు. మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలు ఇచ్చాక భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలను అందజేశారు.

## 'గీతం'ను సందర్శించిన నెదర్లాండ్స్ రాయబారి


గెరార్ట్స్‌కు జ్ఞాపిక అందజేస్తున్న దృశ్యం

సాగర్‌నగర్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): నెదర్లాండ్ రాయబారి మేరిసా గెరార్ట్స్ మంగళవారం గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో గీతం వీసీ ప్రొఫెసర్ ఎరోల్ డిసౌజా మాట్లాడుతూ నైపుణ్యం గల మానవ వనరులను అందించడానికి బోధనతో పాటు పరిశోధనలకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. అంతర్జాతీయ విశ్వవిద్యాలయాలతో కలిసి పనిచేయడానికి తాము ఆసక్తితో ఉన్నామని పేర్కొన్నారు. అనంతరం మేరిసా గెరార్ట్స్ మాట్లాడుతూ భారత్‌తో తమకు దీర్ఘకాలిక సంబంధాలు ఉన్నాయన్నారు. గీతం వంటి విశ్వవిద్యాలయాలతో నెదర్లాండ్స్‌లోని వర్సిటీలు కలిసి పనిచేయడానికి గల అవకాశాలను పరిశీలిస్తామన్నారు. విశాఖలోని ప్రాచీన డచ్ కట్టడాల పునర్ధరణకు, అధ్యయనానికి గల అవకాశాలపై దృష్టి సారిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో జీమ్సర్ ప్రొవైస్ చాన్సలర్ డాక్టర్ బి.గీతాంజలి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డి.గుణశేఖరన్, ఆర్కిటెక్చర్ డీన్ విభూతి సచ్చదేవ్, డీన్ ఎ.రాజేంద్రప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

## అప్పన్న ఆలయ పైకప్పు మరమ్మతులు పూర్తి




సింహాచలం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): వరాహలక్ష్మీనృసింహస్వామి ఆలయ పైకప్పు నుంచి వర్షపు నీరు లీక్ అవ్వకుండా చేపట్టిన మరమ్మతు పనులు పూర్తయ్యాయి. ఏళ్ల తరబడి కొన్ని రూ.లక్షలు వెచ్చించి పలు రకాలుగా మరమ్మతులు చేపట్టినా చిన్నపాటి వర్షానికే అప్పన్న ఆలయ పైకప్పు నుంచి నీరు కారడంతో భక్తులు ఇబ్బందులు పడేవారు. అయితే ఎట్టకేలకు ప్రొఫెసర్ మునిరత్నం రెడ్డి ఈ విషయాన్ని పుణేకు చెందిన వెంకటేశ్వర చారిటబుల్, ఆధ్యాత్మిక ట్రస్టు సహకారంతో సుమారు రూ.5 కోట్ల వ్యయంతో దాదాపు 8 నెలల క్రితం ఆలయ పైకప్పు మరమ్మతు పనులను పురాతన విధానంలో చేపట్టారు.

## విశాఖలో సింగపూర్ తరహా పర్యాటక అభివృద్ధి

... 5వ పేజీ తరువాయి

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఏ విధంగా వినియోగించుకోవచ్చునో వారిని అడిగి తెలుసుకున్నారు. సింగపూర్ ప్రభుత్వం అమలుచేస్తున్న సస్టెయినబుల్ టూరిజం విధానాలు, ప్రమాణాలు, వ్యర్థాల నిర్వహణ, నీటి సంరక్షణ వంటివి పరిశీలించారు. విశాఖపట్నంలో ఆర్‌కే బీచ్, కైలాసగిరి వంటి పర్యాటక కేంద్రాలను ప్రపంచ స్థాయి ప్రమాణాలతో తీర్చిదిద్దడానికి చేపట్టాల్సిన పర్యావరణ అంశాలపై చర్చించారు. ఇంటర్నేషనల్ ఈవెంట్ల నిర్వహణకు అనుగుణంగా విశాఖపట్నాన్ని ఏ విధంగా అభివృద్ధి చేయాలనే దానిపై ఆలోచనలు పంచుకున్నారు. ఈ పర్యటన విశాఖ పర్యాటక అభివృద్ధికి దోహదపడుతుందన్నారు.

## సెంట్రల్ ఎక్సైజ్ సూపరింటెండెంట్‌కు జైలు శిక్ష

... 5వ పేజీ తరువాయి

వీలుగా తాము సృష్టించిన నకిలీ పత్రాలతో దరఖాస్తు చేయించి విశాఖలోని వీఎస్ఈజెడ్ నుంచి అన్ని అనుమతులూ పొందారు. గోడౌన్ ఏర్పాటుకు స్థలాన్ని కూడా సంపాదించారు. వీటి ఆధారంగా మాలేగావ్‌లోని మూడు సంస్థల నుంచి పన్ను మినహాయింపు కలిగిన ముడిసరుకును దిగుమతి చేసుకున్నారు. తర్వాత వాటిని ఎగ్జిమ్ పాలసీ/అడ్వాన్స్ రిలీజ్ ఆర్డర్ (ఏఆర్ఓ) నిబంధనలకు విరుద్ధంగా ముంబైలోని మూడు సంస్థలకు ఎగుమతి చేశారు. దీనివల్ల కేంద్ర ప్రభుత్వానికి పన్ను రూపేణా రావాల్సిన సుమారు రూ.32.28 కోట్ల ఆదాయానికి గండిపడింది. దీనిపై సీబీఐ అధికారులు గతంలోనే కేసు నమోదుచేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. ఈ కేసులో కె.రాందాస్, పోలాకి జానకిరామ్‌ను నిందితులుగా నిర్ధారిస్తూ, ఐదేళ్ల జైలుశిక్ష, జరిమానా విధించింది. రాందాస్, జానకిరామ్‌లను కేంద్ర కారాగారానికి తరలించినట్టు సీబీఐ అధికారులు పేర్కొన్నారు.

# కొండవాలుపై కన్ను

... 5వ పేజీ తరువాయి

స్వభావం ప్రభుత్వ భూమిగా, వర్గీకరణ కింద కొండ/గుట్టగా నమోదుచేశారు. వ్యవసాయేతర భూమిగా గుర్తించారు. చాలాకాలం క్రితం కొండ సమీపంలో 30 నుంచి 40 ఎకరాల మేర ఇతర గ్రామాలకు చెందిన వారికి డి.పట్టాలు ఇచ్చారు. ఆ పట్టాలకు సంబంధించి భూమితో పాటు జిరాయితీ భూములను కొంతమంది పెద్దలు కొనుగోలు చేశారు. వాటిల్లో తోటలుపెంచుతున్నారు. ఇప్పుడు ఆ తోటలకు ఆనుకుని ఉన్న కొండవాలు ప్రాంతంపై కన్నేశారు. వారం రోజులుగా చెట్లు తొలగించి చదును చేస్తున్నా ఎందుకొచ్చిన గొడవని గ్రామస్థులెవరూ మాట్లాడడం లేదు. ఒకరిద్దరు గ్రామ రెవెన్యూ అధికారికి ఫిర్యాదుచేసినా పట్టించుకోలేదనే వాదన వినిపిస్తోంది. రెవెన్యూ అధికారులకు భారీగా ముడుపులు అందడమే అందుకు కారణమనే ప్రచారం జోరుగా సాగుతుంది.


సన్యాసిరావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

## మాజీ ఎమ్మెల్యే పోతిన సన్యాసిరావుకు నివాళి

మధురవాడ, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): రెండుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికై ప్రజల సంక్షేమమే పరమావధిగా భావించిన దివంగత పోతిన సన్యాసిరావు చిరస్మరణీయులని పలువురు నాయకులు పేర్కొన్నారు. ఇక్కడి సీపీఐ కార్యాలయం వద్ద పోతిన సన్యాసిరావు 41వ వర్ధంతిని మంగళవారం నిర్వహించారు. ముందుగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ మధురవాడ అభివృద్ధికి సన్యాసిరావు చేసిన కృషి మరువలేనిదన్నారు. చంద్రంపాలెం జడ్పీ ఉన్నత పాఠశాల ఏర్పాటుతో పాటు 1964లో మధురవాడ క్వారీ సొసైటీని ఏర్పాటు చేసి 434 మంది కార్మికులకు ఉపాధి కల్పించిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు.

## పేదల ఇళ్ల కాలనీల్లో తాగునీటికి రూ.640 కోట్లు

... 5వ పేజీ తరువాయి

గడచిన మూడు నెలల్లో జిల్లా అభివృద్ధి రేటు సాధించామని, రానున్న కాలంలో అదే వృద్ధి సాధిస్తామన్నారు. సర్వీస్ సెక్టార్‌లో జిల్లా రెండో స్థానంలో ఉందన్నారు. వస్తువుల ఉత్పత్తిలో బెంచ్ మార్కుకు చేరుకున్నామని, పారిశ్రామిక వృద్ధి రేటు 10 శాతం లక్ష్యం కాగా ఇప్పటికే 9.97 శాతం సాధించామని కలెక్టర్ తెలిపారు.

### పోలీస్ కమిషనర్‌కు సీఎం అభినందన

ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న హత్య కేసులను ఛేదించడంలో ఉత్తమ పనితీరు కనబరిచిన నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రతబాగ్చీని సీఎం చంద్రబాబునాయుడు అభినందించారు. అమరావతిలో మంగళవారం అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, పోలీస్ కమిషనర్లతో సీఎం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విశాఖ పోలీస్ కమిషనర్ శంఖబ్రతబాగ్చీ నగరంలో తమ విభాగం పనితీరు గురించి వివరించారు. మూడేళ్ల కిందట కంచరపాలెం స్టేషన్ పరిధిలో జరిగిన స్క్రాప్ వ్యాపారి హత్య కేసును ఇటీవల తాము ఛేదించినట్టు చెప్పారు. అలాగే ఎయిర్‌పోర్టు స్టేషన్ పరిధిలో మహిళ మిస్సింగ్ కేసు మూడేళ్ల పాటు పెండింగ్‌లో ఉండిపోయిందని, తాను ప్రత్యేక చొరవ తీసుకొని కేసు దర్యాప్తు చేయగా ఆమెను కొందరు హత్య చేసినట్టు తేలిందన్నారు. ఆ కేసులో నిందితులను అరెస్టు చేసి రిమాండ్ పంపించామని వివరించారు. దీంతో సీఎం స్పందిస్తూ పెండింగ్ కేసుల దర్యాప్తులో విశాఖ పోలీస్ కమిషనర్‌ను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. జిల్లాల్లో పెండింగ్ కేసులను క్లియర్ చేయాలని ఆదేశించారు. విశాఖపట్నం నగరం మహిళలకు సురక్షిత నగరంగా గుర్తింపు పొందడం పట్ల సీపీని సీఎం అభినందించారు.

## రైల్వే జోన్ కార్యాలయం పనులు పరిశీలించిన జీఎం

- పనులు ఆగకుండా పర్యవేక్షించాలని అధికారులకు ఆదేశం


ముడసర్లోవలో రైల్వే నిర్మాణాలను ఇతర అధికారులతో కలిసి పరిశీలిస్తున్న జీఎం సందీప్ మాథుర్

విశాఖపట్నం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : ముడసర్లోవలో దక్షిణ కోస్తా రైల్వే జోన్ కేంద్ర కార్యాలయం నిర్మాణ పనులను మంగళవారం జనరల్ మేనేజర్ సందీప్ మాథుర్ పరిశీలించారు. మొత్తం ఎన్ని విభాగాలుగా పనులు చేపడుతున్నారు?, ఏ పనిని ఎంత కాలంలో పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు?, అవసరమైనంత మంది కార్మికులు, సాంకేతిక నిపుణులు అందుబాటులో ఉన్నారా? లేదా?...అనే అంశాలను అడిగి తెలుసుకున్నారు. సైట్ ప్లాన్‌ను, అక్కడి నిర్మాణాలను తనిఖీ చేశారు. ఆగకుండా పనులు కొనసాగించాలని, నిత్యం పర్యవేక్షణ కూడా చేయాలని అధికారులకు సూచించారు. ఈ పర్యటనలో ప్రిన్సిపల్ చీఫ్ ఇంజనీర్ అంకుశ్ గుప్తా, దక్షిణకోస్తా జోన్ ఓఎస్‌డీ చంద్రశేఖర్, కన్‌స్ట్రక్షన్ చీఫ్ ఇంజనీర్ డి.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

## నేడు సీఎం రాక

... 5వ పేజీ తరువాయి

మంత్రి నిర్మలా సీతారామన్‌తో కలిసి గ్లోబల్ కేపబులిటీ సెంటర్ వ్యాపార సదస్సులో పాల్గొంటారు. అనంతరం సాయంత్రం 5 నుంచి 6 గంటల వరకు అక్కడే సరయు హాలులో ఫ్రెంచ్ ప్రతినిధులతో, ఆ తరువాత శారదా హాలులో నెదర్లాండ్స్ బృందంతో చర్చిస్తారు. రాత్రి ఏడు గంటలకు అక్కడి నుంచి బయలుదేరి విమానాశ్రయానికి చేరుకుంటారు. 7.45 గంటలకు విమానంలో బయలుదేరి విజయవాడ వెళతారు.

## నాలుగు కళాశాలలపై కొరడా

... 5వ పేజీ తరువాయి

తనిఖీ సమయంలో 25 మంది కూడా లేరు. అలాగే, ఫ్యాకల్టీ 26 మంది ఉన్నట్టు రిజిస్టర్‌లో నమోదు చేశారు. కానీ, అధికారులు తనిఖీలు సమయంలో ఆరుగురు మాత్రమే ఉన్నారు. మిగిలినవారి గురించి అధికారులు ప్రశ్నించగా లీవ్‌లో ఉన్నట్టు పేర్కొన్నారు. అలాగే, భీమిలిలోని విశాఖ లా కాలేజీలో బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సూచనలకు అనుగుణంగా క్లాస్ రూమ్‌లు, మ్యూట్ కోర్టులు, ఆఫీస్ రూమ్‌లు, ఫర్నీచర్ లేనట్టు గుర్తించారు. 2016 నుంచి 2022 మధ్య కాలానికి సంబంధించిన అటెండెన్స్ రిజిస్టర్‌లు కూడా లేనట్టు నిర్ధారించారు. అలాగే, మధురవాడలోని ప్రేమ బీఈడీ కాలేజీని నేషనల్ కౌన్సిల్ ఫర్ టీచర్ ఎడ్యుకేషన్ (ఎన్‌సీటీ), ఏయూ, ఉన్నత విద్యా మండలి అనుమతి లేకుండానే క్యాంపస్‌ను మరోచోటకు మార్చేశారు. పలువురు ఉద్యోగులను అకస్మాత్తుగా తొలగించి వారికి జీతాలు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేయడంతో పాటు రిలీవింగ్ సర్టిఫికెట్లు ఇవ్వకుండా వేధిస్తున్నారు. టీచింగ్ ఫ్యాకల్టీ కూడా సరిగా లేరని, ప్రిన్సిపాల్‌కు అర్హతలు లేవని, తరగతి గదులు సరిగా లేవని గుర్తించారు. అలాగే, చీపురుపల్లిలోని సెయింట్ మేరీ కాలేజీ ఆఫ్ ఎడ్యుకేషన్‌లోనూ క్లాస్ రూములు సరిగా లేవని, గదుల్లోకి వెంటిలేషన్ రావడం లేదని, ల్యాబ్, నీరు, గ్రౌండ్ సదుపాయాలు లేవని అధికారులు గుర్తించారు. ఈ నేపథ్యంలో ఈ ఏడాది ప్రవేశాలు నిలిపివేయడంతోపాటు చర్యలు ఎందుకు తీసుకోకూడదో తెలియజేయాలంటూ అధికారులు షోకాజ్ నోటీసులను జారీ చేశారు. వారం రోజుల్లో సదరు కాలేజీ యాజమాన్యాలు ఇచ్చే వివరణను బట్టి తదుపరి చర్యలు తీసుకోనున్నారు. ఈ విషయమై ఏయూ వైస్ చాన్సలర్ జీపీ రాజశేఖర్ మాట్లాడుతూ ఏయూ పరిధిలోని కాలేజీలు నిబంధనలు అతిక్రమించి వ్యవహరిస్తే చర్యలు తప్పవన్నారు. కాలేజీల నిర్వహణలో కీలకమైన అంశాలను క్షుణ్ణంగా పరిశీలిస్తామని, మౌలిక సదుపాయాలు, ఫ్యాకల్టీ, విద్యార్థుల అవసరాలు వంటి అంశాల్లో రాజీ లేదన్నారు. ముఖ్యంగా విద్యార్థులు రాకుండా హాజరువేయడం వంటి చర్యలకు పాల్పడితే కఠినంగా వ్యవహరిస్తామన్నారు. వీటికి అడ్డుకట్ట వేసేందుకు ఎఫ్ఆర్ఎస్ విధానాన్ని అనుబంధ కాలేజీల్లో అమలు చేయాలని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినట్టు వెల్లడించారు. సీడీసీ డీన్ టీవీ కృష్ణ మాట్లాడుతూ నిబంధనలను అతిక్రమించిన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. షోకాజ్ నోటీసులు ఇచ్చిన వారి నుంచి వివరణ తీసుకుని తదుపరి చర్యలు ఉంటాయన్నారు. రానున్న రోజుల్లో వీసీ ఆదేశాల మేరకు ఇతర అనుబంధ కాలేజీల్లో తనిఖీలు నిర్వహిస్తామన్నారు.

# ఆటో డ్రైవర్లకు భరోసా

... 5వ పేజీ తరువాయి

అంటే రూ.15 వేల చొప్పున చెల్లించనున్నట్టు ప్రకటించింది. దరఖాస్తుల స్వీకరణ, లబ్ధిదారుల ఎంపికపై రవాణా శాఖ అధికారులకు విధి విధానాలను జారీ చేసింది.

### ఎవరు అర్హులు?

ఆటోరిక్షా, మోటారు క్యాబ్, మ్యాక్సీక్యాబ్‌ను సొంతంగా నడుపుకుంటూ కుటుంబాన్ని పోషించుకునే వారికే ఈ పథకం వర్తిస్తుంది. ఆధార్ కార్డు, బియ్యం రేషన్ కార్డు ఉండాలి. ఏపీ రవాణా శాఖ జారీచేసిన డ్రైవింగ్ లైసెన్స్ ఉండాలి. వాహనం రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్, ఫిట్‌నెస్, ట్యాక్స్ వంటివి చెల్లుబాటు అయ్యే రికార్డులు ఉండాలి. ఆటోలకు ఒక నెలలోపు తీసుకున్న ఫిట్‌నెస్ సర్టిఫికెట్ తప్పనిసరి. ప్రయాణికులను చేరవేసే వాహనాలు నడిపేవారు మాత్రమే ఈ పథకానికి అర్హులు. సరకు రవాణా వాహనాలు నడిపేవారు ఈ పథకానికి అర్హులు కారు. ఒక కుటుంబంలో ఒక వాహనానికి మాత్రమే పథకం వర్తిస్తుంది. ఇతర వృత్తి సంబంధిత ప్రభుత్వ పథకాల్లో లబ్ధిదారులు అయితే.. ఈ పథకానికి అనర్హులుగా పరిగణిస్తారు. దరఖాస్తుదారుల కుటుంబ సభ్యుల్లో ప్రభుత్వ ఉద్యోగులు లేదా ఉద్యోగ విరమణ చేసినవారు ఉండకూడదు. అయితే పారిశుధ్య కార్మికుల కుటుంబాలకు వెసులుబాటు కల్పించారు. ఆదాయ పన్ను చెల్లింపుదారులు, నెలకు 300 యూనిట్లకంటే ఎక్కువ (12 నెలల సగటు) విద్యుత్ వినియోగించేవారు, పల్లంభూమి మూడు ఎకరాలు, మెట్ట పది ఎకరాలకు మించి ఉన్నవారు ఈ పథకానికి అనర్హులవుతారు. పట్టణ ప్రాంతంలో 1,000 చదరపు అడుగుల కంటే ఎక్కువ విస్తీర్ణంలో నివాస భవనం వున్నవారు, లీజు/ అద్దెకు తీసుకుని వాహనాలు, ఆర్టీఓ చలానాలు బాకీ ఉన్న వాహనాలు ఈ పథకం కిందకు రావు.

### దరఖాస్తుకు మూడు రోజులే గడువు

అర్హులైన ఆటో రిక్షా, మోటారు క్యాబ్, మ్యాక్సీక్యాబ్‌ల డ్రైవర్లు బుధవారం నుంచి జీఎస్‌డబ్ల్యూఎస్ పోర్టల్‌లో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. ఈ నెల 19వ తేదీ వరకే గడువు ఉంది. అందిన దరఖాస్తులపై గ్రామ/వార్డు సచివాలయాల సిబ్బంది 22వ తేదీన క్షేత్రస్థాయిలో విచారణ జరుపుతారు. ఎంపీడీఓలు/జీవీఎంసీ జోనల్ కమిషనర్‌లు తుది జాబితాలను కలెక్టర్‌కు పంపారు. అర్హుల జాబితాను ఈ నెల 24వ తేదీన ప్రకటిస్తారు. ఈ పథకానికి అర్హులుగా ఎంపికైన వారికి దసరా పండుగ రోజున బ్యాంకు ఖాతాలో నగదు జమ అవుతుంది.

## పద్మావతిశ్రీనివాస ఆలయంలో ద్వాదశ ఆరాధన



ప్రత్యేక అలంకరణలో సతీసమేతుడైన శ్రీనివాసులు

ఎంవీపీ కాలనీ, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ఆరో సెక్టర్‌లోని శ్రీపద్మావతి గోదాసమేత శ్రీశ్రీనివాస స్వామి ఆలయంలో మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. వైష్ణవ కృష్ణాష్టమి సందర్భంగా ద్వాదశ ఆరాధన, శ్రీకృష్ణ జనన ఘట్ట ప్రదర్శన, పంచామృతాభిషేకం, 108 రకాల విశేష పదార్థాల ఆరగింపు, అష్టోత్తర శత నామార్చన మంగళ శాసనం, ఉట్ల సంబరం వంటివి నిర్వహించారు.

### ప్రపంచశాంతిపై పోస్టర్ విడుదల

ఎంవీపీ కాలనీ, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : ఐక్యరాజ్యసమితి ప్రకటన మేరకు ప్రతి ఏడాది సెప్టెంబరు 21 ప్రపంచ శాంతి దినంగా సభ్య దేశాలు జరపుకుంటున్న సందర్భంగా శాంతి, సంస్కృతిని పెంపొందించుకోవాలనే నినాదంతో రూపొందించిన వాల్‌పోస్టర్‌ను మంగళవారం ఎంవీపీ కాలనీలోని అళ్వార్‌దాస్ డిగ్రీ కళాశాలలో ఆవిష్కరించారు. డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.జగదేశ్వరరావు, ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఫర్ రిలీజియస్ ఫ్రీడమ్ సంస చైర్మన్ నరవ ప్రకాశరావు, డాక్టర్ బాబ్జీ, డాక్టర్ అప్పారావు, లక్ష్మి, సుజాత తదితరులు పాల్గొన్నారు.

## ఓజోన్ పొర ప్రాధాన్యంపై విద్యార్థులకు అవగాహన

పెదవాల్తేరు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : ఓజోన్ పొర పరిరక్షణ అందరి బాధ్యత అని పలువురు వక్తలు పేర్కొన్నారు. అంతర్జాతీయ ఓజోన్ పరిరక్షణ దినం సందర్భంగా మంగళవారం సాయంత్రం బీచ్ రోడ్డులోని గాయత్రి విద్యాపరిషత్ ఎంఎల్‌బీటీ పాఠశాలలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ కె.మధురవాణి మాట్లాడుతూ బాల్యం నుంచే చిన్నారుల్లో పర్యావరణ పరిరక్షణ, ప్లాస్టిక్ వినియోగం తగ్గించడం వంటి అంశాలపై అవగాహన అవసరమన్నారు. నిరంతరం విడుదలవుతున్న కార్బన్ ఉద్గారాలను తగ్గించడంలో చెట్ల పెంపకం వంటివి కీలక పాత్ర పోషిస్తాయన్నారు. బాలల్లో ప్రతిభతో పాటు సామాజిక బాధ్యత కూడా ఉండాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు తమ నైపుణ్యాన్ని ప్రదర్శించి అందమైన చిత్రాలతో ఓజోన్ దినోత్సవ ప్రాధాన్యతను వివరించారు. చెట్లు నాటడం భూగర్భ జలవనరుల వినియోగం, ఎండ వేడిమి తగ్గించడం వంటి అంశాలపై పలువురు విద్యార్థులు ప్రసంగించారు. కార్యక్రమంలో వాణి, ఉషశ్రీ, విజయకుమార్, పవన్‌కుమార్, ఉదయ నరేంద్ర స్వప్న, ప్రత్యూష తదితరులు పాల్గొన్నారు.

## సినిమా గైడ్

- **మిరాయి** : జగదాంబ, మెలోడి, శరత్, కామేశ్వరి, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), కన్య (గాజువాక), ఎస్.వి.సి.లిఖిత (శ్రీహరిపురం) అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- **కిష్కింధపురి** : లీలామహల్, సంగం, శ్రీరామా, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), మినీ మోహిని (గాజువాక),
- **అర్జున్ చక్రవర్తి** : రమాదేవి,
- **మదరాసి** : శ్రీకన్య
- **ఘాటీ** : కిన్నెర, వెంకటేశ్వర-2, గోకుల్, ముక్తాస్, మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక) లిఖిత (శ్రీహరిపురం)
- **పరదా** : , శ్రీకన్య-2 (గాజువాక)
- **కూలీ** :వెంకటేశ్వర-1, అరుణ (పెదగంట్యాడ),
- **మహావతార్ నరసింహ** : లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా),

## రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 14, టమాటా 18, వంకాయలు (తెలుపు) 42, వంకాయలు (నలుపు) 42, బెండకాయలు 18, పచ్చిమిర్చి 40, కాకరకాయలు 34, బీరకాయలు 32, ఆనపకాయ 16, కాలీఫ్లవర్ 32, క్యాబేజి 16, క్యారెట్ 44, దొండకాయలు 34, బంగాళ దుంపలు 19, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 34, అల్లం (పాతది) 70, బరబాటి 32, ముల్లంగి 36, నిమ్మకాయలు (కిలో) 65, బద్దచిక్కుడు 50, దోస కాయలు 24, వెల్లుల్లి (పెద్దవి) 70, కొబ్బరికాయ (పెద్దది) 35, బీన్స్ (పెన్సిల్) 50, కీరదోస 32, కాప్సికమ్ 58, పొట్లకాయ (పెద్దది) 24, చేమదుంపలు 32, చిలగడదుంపలు 35, కంద 40, దేముడు చిక్కుడు 66, గోరు చిక్కుడు 28, కూర పెండలం 26, బ్రకోలి 45, పనస పొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 5, పాలకూర (కట్ట) 5, తోటకూర (కట్ట) 5, మామిడికాయలు 80, బూడిద గుమ్మడి కాయ 20, కర్రపెండలం 24, మామిడి అల్లం 56, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 70.

| కోడిగుడ్లు (నెక్) | |
|---|---|
| (వంద - రూ.లలో) | |
| విశాఖపట్నం | 555 |
| విజయనగరం | 559 |
| శ్రీకాకుళం | 559 |

| చికెన్ ధరలు | |
|---|---|
| బ్యాగ్ | |
| రైతు ధర | 130 |
| లైవ్ ధర | 150 |
| విత్ స్కిన్ | 270 |
| స్కిన్‌లెస్ | 280 |

# భాగస్వామ్య సదస్సుకు పకడ్బందీగా ఏర్పాట్లు

- జీవీఎంసీ అధికారులకు కమిషనర్ కేతన్ గార్గ్ ఆదేశం
- సదస్సు జరిగే ఏయూ మైదానం పరిశీలన



సదస్సు జరిగే ఏయూ మైదానాన్ని పరిశీలించి అధికారులకు సూచనలిస్తున్న జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్

వెంకోజీపాలెం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : విశాఖ వేదికగా నవంబరు 2025లో జరుగనున్న భాగస్వామ్య సదస్సుకు జీవీఎంసీ చేపట్టాల్సిన ఏర్పాట్లపై చర్యలు చేపట్టాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ జీవీఎంసీ ఉన్నతాధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన భాగస్వామ్య సదస్సు జరిగే 3వ జోన్‌లో ఏయూ గ్రౌండ్ ప్రధాన వేదిక, ఇతర పరిసర ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జీవీఎంసీ కమిషనర్ మాట్లాడుతూ 2025, నవంబరులో విశాఖ వేదికగా జరుగనున్న భాగస్వామ్య సదస్సుకు ఎంతో మంది అతిథులు వస్తారని, ఆ సమయానికి విశాఖ నగరాన్ని సుందరంగా, ఆకర్షణీయంగా తీర్చిదిద్దేందుకు అధికారులు చర్యలు చేపట్టాలని స్పష్టం చేశఆవిశాఖ ఎయిర్‌పోర్టు నుంచి జాతీయ రహదారి మీదుగా రైల్వే స్టేషన్, తెలుగుతల్లి ఫ్లై ఓవర్ బ్రిడ్జి నుంచి ఏయూ గ్రౌండ్ వరకు అవసరమగు ఏర్పాట్లకు తగు రూట్ మ్యాప్ సిద్ధం చేయాలని, అలాగే ఆయా ప్రాంతాల్లో నూతనంగా నిర్మిస్తున్న భవన నిర్మాణాలపై గ్రీన్ మ్యాట్‌లు కప్పేలా చర్యలు చేపట్టాలని జీవీఎంసీ ముఖ్య పట్టణ ప్రణాళిక అధికారి ఎ.ప్రభాకరరావుకు సూచించారు. నగర సుందరీకరణలో భాగంగా సెంటర్ మీడియన్‌లలో పచ్చదనం, చెట్లు ట్రిమ్మింగ్ ఏయూ గ్రౌండ్ రోడ్డు పక్కన పుట్‌పాత్‌లకు ఇరువైపులా ఉన్న పిచ్చిమొక్కలను తొలగించి ఆ ప్రాంతాల్లో పచ్చదనాన్ని అభివృద్ధి పరచాలని డీడీహెచ్ ఎం.దామోదరరావును ఆదేశించారు. ఇంజనీరింగ్ పనుల్లో భాగంగా 26 స్ట్రెచ్ ప్రాంతాల్లో దృష్టి సారించి పుట్‌పాత్‌లు, రోడ్లు, పెయింటింగ్, లైటింగ్ తదితర అభివృద్ధి పనులకు సంబంధించిన నివేదికను సిద్ధం చేయాలని ప్రధాన ఇంజనీరు పీవీవీ సత్యనారాయణ రాజును ఆదేశించారు. భాగస్వామ్య సదస్సు జరిగే వరకు అధికారులతో ప్రతి వారం సమీక్షలు నిర్వహిస్తూ సంబంధిత విభాగాలతో సమన్వయ పనులపై దృష్టి సారించాలని జీవీఎంసీ అదనపు కమిషనర్ ఎస్ఎస్ వర్మకు చెప్పారు. జీవీఎంసీ సదస్సు కోసం నిర్వహించే పనుల్లో ఏపీయూఐఎంఎల్ ప్రతినిధి చేటన్‌ను భాగస్వామ్యం చేయాలని ప్రధాన ఇంజనీర్‌కు సూచించారు. సదస్సు నిర్వహణలో ఇతర శాఖల సహకారం అవసరమైతే, అందుకు తగిన ప్రతిపాదనలు నివేదిక రూపంలో పంపాలని అధికారులను కమిషనర్ ఆదేశించారు. భాగస్వామ్య సదస్సు నిర్వహణ పూర్తయ్యే వరకు జోనల్ కమిషనర్లు పర్యవేక్షణ పూర్తి స్థాయిలో ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు.

**సదస్సు ముగిసే వరకు పారిశుధ్య నిర్వహణ**

ఇప్పటి నుంచే పారిశుధ్య నిర్వహణ కోసం పిన్ పాయింట్ వారీగా కార్మికుల సర్దుబాటు, తదితర అంశాలపై ఒక ప్రణాళికను సిద్ధం చేసుకోవాలని జీవీఎంసీ ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఈఎన్వీ నరేష్‌కుమార్‌ను కమిషనర్ ఆదేశించారు. ఈ పర్యటనలో జోనల్ కమిషనర్లు కె.శివప్రసాద్, ఎం.మల్లయ్య నాయుడు, పర్యవేక్షక ఇంజనీర్లు సంపత్‌కుమార్, కె.శ్రీనివాసరావు, కార్యనిర్వాహక ఇంజనీర్లు గంగాధర్, సుధాకర్, ఏసీపీ మధుసూదనరావు, ఉపకార్యనిర్వాహణ ఇంజనీర్ (ఎలక్ట్రికల్) అన్నంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

## 22 నుంచి అప్పన్న క్షేత్రపాలకుని సన్నిధిలో శరన్నవరాత్రి ఉత్సవాలు

సింహాచలం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): సింహాద్రి అప్పన్న స్వామి కొలువుదీరిన సింహగిరి క్షేత్రపాలకుడు బాలత్రిపురసుందరి సహిత త్రిపురాంతకస్వామి ఆలయంలో ఈ నెల 22 నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమవుతాయని ఈవో వి.త్రినాథరావు తెలిపారు. ఇందులో భాగంగా ఉదయం త్రిపురాంతకస్వామికి మహాన్యాసపూర్వక ఏకవార రుద్రాభిషేకం, సాయంత్రం సుహాసినీ కుంకుమపూజలు జరుపుతామన్నారు. ఈ పూజల్లో పాల్గొనదలచిన భక్తులు నేరుగా రూ.1000 చెల్లించాలన్నారు. టికెట్లను క్షేత్రపాలకుని సన్నిధిలో, సింహగిరిపై ఉన్న పీఆర్వో కార్యాలయంలో పొందవచ్చన్నారు. అలాగే ఆన్‌లైన్‌లో ఎస్‌బీఐ సింహాచలం శాఖ అకౌంట్ నంబర్ 11257208642, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ ఎస్‌బీఐఎన్ 0002795, యూపీఐ ఐడీ ఈవోఎస్‌వీఎల్ఎన్ఎస్‌డీకి నగదు బదిలీ చేసి ఆ ట్రాన్సక్షన్‌తో కూడిన నంబర్‌ను, గోత్రనామాలను, పూజ జరిపించుకునే తేదీలను 6303800736 నంబర్‌కు తెలియజేయాలన్నారు. ఈ అవకాశాన్ని భక్తులు సద్వినియోగం చేసుకోవాలని ఈవో కోరారు.

## నేడు దివ్యాంగులకు ఉపకరణాల పంపిణీ

పద్మనాభం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి):ప్రధాని నరేంద్ర మోదీ జన్మదిన వేడుక లను పురస్కరించుకుని బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో బుధవారం పద్మనాభంలో దివ్యాంగులకు ఉపకరణాల పంపిణీ కార్యక్రమాన్ని గోస్తనీ విద్యాపీఠ్ హైస్కూల్‌లో నిర్వహిస్తున్నట్టు పార్టీ ఇన్‌చార్జి రూపాకుల రవికుమార్ తెలిపారు. గత నెలలో గుర్తింపు శిబిరం ద్వారా ఎంపిక చేసిన దివ్యాంగులకు కృత్రిమ అవయవాలు, వీల్ చైర్లు, వినికిడి యంత్రాలు వంటి వాటిని పంపిణీ చేస్తామన్నారు.

### ఇంజనీరింగ్ అధికారుల అర్హతలను ప్రకటించాలని వినతి

సింహాచలం, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): వరాహలక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో పనిచేస్తున్న ఇంజనీరింగ్ అధికారుల విద్యార్హతలను బహిర్గతం చేయాలని విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర అర్చక పురోహిత్ మఠ మందిర్ విభాగ ప్రతినిధి పూడిపెద్ది శర్మ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంగళవారం ఈవో వి.త్రినాథరావును కలిసి లిఖితపూర్వకంగా కోరారు.

## షరతులు లేకుండా వాహనమిత్ర

- ఆటో ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పడాల గోవింద్ డిమాండ్




సమావేశంలో మాట్లాడుతున్న పడాల గోవింద్

వెంకోజీపాలెం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆటో డ్రైవర్లకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం ఇస్తున్న వాహ మిత్ర పథకం రూ.15000 షరతులు లేకుండా ప్రతి ఒక్క డ్రైవర్ బ్యాంకు ఖాతాలో వేయాలని, ప్రమాదకరంగా ఉన్న జీవో నెంబరు 21, 31లను రద్దు చేయాలని ఆటో ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పడాల గోవింద్ డిమాండ్ చేశారు. మంగళవారం కృష్ణా కళాశాల సమీపంలోని ఏఐటీయూసీ కార్యాలయంలో ఆటో డ్రైవర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పెట్రోల్, డీజిల్ జీఎస్టీ పరిధిలోకి తీసుకొచ్చి ఆటో డ్రైవర్లను ఆదుకోవాలని, డ్రైవర్లకు పీఎఫ్, ఈఎస్ఐతో కూడిన ఒక సంక్షేమ బోర్డు ఏర్పాటుకు ఈ నెల 18న జరిగే అసెంబ్లీ సమావేశాల్లో తీర్మానం చేయాలని, ప్రమాద బీమా పాలసీ అమలు చేసి డ్రైవర్లను రక్షించాలని ప్రభుత్వాన్ని కోరారు. సమావేశంలో ఆటోయూనియన్ నాయకులు వాసు, లోవరాజు, నాగు, శ్రీను, రూపతి, శివ పాల్గొన్నారు.

## ఏయూ తత్వశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో అంతర్జాతీయ సదస్సు



సదస్సుకు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరిస్తున్న వీసీ రాజశేఖర్, విభాగాధిపతులు, ఆచార్యులు

విశాఖపట్నం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : ఎయూ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా ఏయూ తత్వశాస్త్ర, రెలిజియస్ స్టడీస్ ఆధ్వర్యంలో 'ఎక్స్‌ప్లోరింగ్ ద ఫిలాసఫికల్ లెగసీ ఆఫ్ ప్రొఫెసర్ కె.సచ్చిదానంద మూర్తి' అంశంపై ఈ నెల 24 నుంచి 26 వరకు అంతర్జాతీయ సదస్సు నిర్వహించనున్నన్నారు. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను ఏయూ వీసీ జీపీ రాజశేఖర్ మంగళవారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.నరసింహారావు, తత్వశాఖాధిపతి కె.రమేష్‌బాబు, సీనియర్ ఎమెరిటస్ ప్రొఫెసర్ ఎంవీ కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే వెలగపూడి చొరవతో ముడసర్లోవ వాకర్స్ క్లబ్‌కు విద్యుత్ కనెక్షన్



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న ముడసర్లోవ వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు

ఆరిలోవ, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : ముడసర్లోవ వాకర్స్ అసోసియేషన్ భవనానికి ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ బాబు చొరవతో విద్యుత్ కనెక్షన్ మంజూరైంది. ఈ నేపథ్యంలో మంగళవారం ఈ కార్యాలయం వద్ద ఎమ్మెల్యే ఇందుకు సంబంధించిన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ భవనానికి విద్యుత్ కనెక్షన్ లేదని సభ్యులు చెప్పడంతో వెంటనే సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టామన్నారు. ఈ ప్రాంతవాసులకు గతంలో ఇచ్చిన జీవో నం.296 ద్వారా ఇళ్ల పట్టాలు జారీ చేసిన వారికి రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభమైనట్టు చెప్పారు. ఇంకా ఇళ్ల పట్టాలు జారీ చేయని వారికి జీవో నెంబరు 30 ద్వారా ఈ ఏడాది డిసెంబరు వరకు ధరఖాస్తు ప్రకియ జరగనుందని తెలిపారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెలగపూడిని వాకర్స్ క్లబ్ ప్రతినిధులు సన్మానించారు. కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు పల్లా శ్రీనివాసరావు, నాగులపల్లి రవి కుమార్, టీడీపీ 12వ వార్డు ఇన్‌చార్జి ఒమ్మి అప్పలరాజు, టీడీపీ 12వ వార్డు అధ్యక్షుడు గాడి సత్యం, పార్లమెంటరీ కార్యనిర్వాహక కార్యదర్శి ఒమ్మి పోలారావు, పార్లమెంటరీ కార్యదర్శి ఏడువాక సన్యాసిరావు, ఎస్సీ సెల్ అధ్యక్షుడు బడుమూరు గోవింద్, పాత్రకండ ధర్మారావు తదితరులు పాల్గొన్నారు.

## వచ్చే నెల 27 నుంచి ఎఫ్‌డీపీ



ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న వీసీ ఆచార్య జీపీ రాజశేఖర్, పాల్గొన్న ఆచార్యులు

విశాఖపట్నం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : ఏయూ పర్యావరణ శాస్త్ర విభాగంలో అక్టోబరు 27 నుంచి ఐదు రోజుల పాటు ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం (ఎఫ్‌డీపీ) నిర్వహిస్తున్నట్టు ఏయూ ఉపకులపతి జీపీ రాజశేఖర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన బ్రోచర్‌ను మంగళవారం తన కార్యాలయంలో ఆయన ఆవిష్కరించారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం శతాబ్ది ఉత్సవాలు పర్యావరణ శాస్త్రవిభాగం గోల్డెన్ జూబ్లీ వేడుకల్లో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు వెల్లడించారు. 'ఎంపవరింగ్ ఎన్విరాన్‌మెంటల్ స్టీవార్డ్‌షిప్' అంశంపై ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఎంవీఆర్ రాజు, పర్యావరణ శాస్త్ర విభాగాధిపతి పి.సుభాషిణిదేవి, బీవోఎస్ చైర్మన్ కె.వీరభద్రంపాల్గొన్నారు

### ఏయూ స్టాఫ్ కో-ఆపరేటివ్ సొసైటీ కార్యవర్గం




నూతన కార్యవర్గ ప్రతినిధులు

విశాఖపట్నం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయం స్టాఫ్ కో-ఆపరేటివ్ సొసైటీ నూతన కార్యవర్గం ఎన్నిక మంగళవారం జరిగింది. సొసైటీ అధ్యక్షులుగా ప్రొఫెసర్ జి.సుధాకర్, కార్యదర్శిగా కె.సోమేశ్వరరావు, ఉపాధ్యక్షుడిగా ఎన్వీ గిరి, సంయుక్త కార్యదర్శిగా షేక్ ఖాదర్‌బాబా, కోశాధికారిగా ప్రొఫెసర్ ఎన్.యుగంధర్ ఎన్నికయ్యారు.

# శరన్నవరాత్రి మహోత్సవాల బ్రోచర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణశ్రీనివాస్ తదితరులు

మద్దిలపాలెం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : పూర్ణామార్కెట్‌లో వేంచేసియున్న దుర్గాలమ్మ అమ్మవారి శరన్నవరాత్రి మహోత్సవాల బ్రోచర్‌ను దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ మంగళవారం శివాజీపాలెంలోని తన క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వంశీకృష్ణశ్రీనివాస్ మాట్లాడుతూ వినాయకచవితి ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించుకున్న నగరవాసులు శరన్నవరాత్రి మహోత్సవాలు ఘనంగా చేపట్టాలన్నారు. ఈనెల 22 నుంచి వచ్చే నెల 2 వరకు జరగనున్న పూర్ణమార్కెట్‌లోని ఉత్సవాలకు అందరూ సహకారం అందించాలని, ఉత్సవాలకు తనవంతు పూర్తి సహాయసహకారాలు అందిస్తానని చెప్పారు. కార్యక్రమంలో ఆలయ ఈవో శేఖర్‌బాబు, మాజీ కార్పొరేటర్ పిల్లి రమణ, కూటమి నాయకులు లెంక త్రినాథ్, రాము, రఘు తదితరులు పాల్గొన్నారు.

## నూతన ఆవిష్కరణలతో ముందడుగు

- ఏయూ రెక్టార్ కిషోర్‌బాబు




బహుమతులు పొందిన విద్యార్థులతో ఏయూ రెక్టార్ కిషోర్‌బాబు

మద్దిలపాలెం, సెప్టెంబరు16 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు నూతన ఆవిష్కరణలతో ముందుకెళ్లాలని ఏయూ రెక్టార్ కిషోర్‌బాబు పేర్కొన్నారు. ఏయూలోని వైవీఎస్ ఆడిటోరియంలో మంగళవారం నిర్వహించిన సివిల్ ఇంజినీరింగ్ విద్యార్థుల వార్షిక సమ్మేళనం-2కె25 ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సివిల్ ఇంజినీరింగ్‌లో ప్రతిభ కనబరిస్తే ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చన్నారు. శాస్త్ర ప్రగతిని, నిపుణుల విలువైన సూచనలు పొందడానికి ఇటువంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయన్నారు. నిరంతర జ్ఞానాన్వేషణతో యువత శ్రమించాలని సూచించారు. అనంతరం వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం సాంకేతిక సమ్మేళనంలో భాగంగా ఇండియన్ జియోటెక్నికల్ సొసైటీ, ఇండియన్ కాంక్రీట్ ఇనిస్టిట్యూట్ విశాఖ ప్రాంతీయ కేంద్రాలు ఎసెన్షియల్ ఆఫ్ సివిల్ ఇంజినీరింగ్ అంశంపై సెమినార్ నిర్వహించాయి. కార్యక్రమంలో ఐఐటీ కాన్పూర్ విశ్రాంత ఆచార్యులు మాధవ్, ఏయూ ఇంజినీరింగ్ విభాగం ప్రొఫెసర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

## మా సమస్యలు పరిష్కరించండి

- దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వంశీకృష్ణశ్రీనివాస్‌కు భవన నిర్మాణ కార్మికుల వినతి



ఎమ్‌డిపి2: దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వంశీకృష్ణశ్రీనివాస్‌కు వినతి పత్రం అందిస్తున్న భవన నిర్మాణ కార్మికులు, ఏఐటీయూసీ నాయకులు

మద్దిలపాలెం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : భవన నిర్మాణ కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని కోరుతూ మంగళవారం శివాజీపాలెంలో దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వంశీకృష్ణశ్రీనివాస్‌కు ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పడాల రమణ వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా పడాల రమణ మాట్లాడుతూ 2019లో జగన్ సర్కార్ సంక్షేమ బోర్డును నిర్వీర్యం చేస్తూ జీవో 1214 జారీ చేయడం వల్ల కార్మికుల క్లైయిమ్‌లు పెండింగ్‌లో ఉండిపోయాయన్నారు. దీనిపై ఎన్నికలకు ముందు కూటమి నాయకులకు వినతిపత్రాలు సమర్పించగా, కార్మికులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చి పదహారు నెలలు గడవడమే కాకుండా వెల్ఫేర్ బోర్డుకు చైర్మన్‌ను నియమించినా ఇంకా పెండింగ్ క్లైయిమ్స్‌కు పరిష్కారం జరగలేదన్నారు. వెల్ఫేర్ బోర్డులో ఫెండింగ్ క్లైయిమ్స్ పరిష్కరించి దరఖాస్తుదారులకు సొమ్ము చెల్లించాలన్నారు. కొత్త సభ్యుల నమోదు సరళతరం చేసి వారికి గుర్తింపు కార్డులు ఇవ్వాలని, గత ప్రభుత్వం బోర్డు నుంచి మళ్లించిన నిధులను మళ్లీ బోర్డుకు జమ చేయాలని, వెల్ఫేర్ బోర్డు పాలక మండలిలో కార్మిక ప్రతినిధుల కోటాలో ఏఐటీయూసీకి స్థానం కల్పించాలని కోరారు.

కార్మిక నేతల వినతికి స్పందించిన ఎమ్మెల్యే కార్మికుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకుని వెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు కోట సత్తిబాబు, సాయిబాబా, బోర రమణ, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## వెలుగు యానిమేటర్స్ నిరసన



డీఆర్‌డీఏ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న వెలుగు యానిమేటర్స్

ఎంవీపీ కాలనీ, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : బకాయి వేతనాలు చెల్లించాలని, ఆన్‌లైన్ పనిభారాన్ని తగ్గించడంతో పాటు ఇతర డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని రాష్ట్ర వెలుగు వోఏ (యానిమేటర్స్) ఉద్యోగుల సంఘం డిమాండ్ చేసింది. తమ డిమాండ్లు నెరవేర్చాలని డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ కార్యాలయం వద్దకు వచ్చి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సీఐటీయు ఆధ్వర్యంలో ఉద్యోగులు కార్యాలయం ముందు తమ డిమాండ్లను నినదిస్తూ, నిరసన వ్యక్తం చేశారు. యానిమేటర్స్‌కు 5జీ మొబైల్ సిమ్ కార్డులు ఇవ్వాలని, కాలపరిమితి సర్క్యులర్‌ను రద్దు చేయాలని, వేతనాలు పెంచాలని, హెచ్ఆర్ పాలసీ అమలు చేయాలని, రూపది లక్షల గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని, అర్హులైన వారికి సీసీలుగా ప్రమోషన్ ఇవ్వాలని, రెండేళ్ల స్త్రీ నిధి ఇన్సెంటివ్ ఇవ్వాలని, రాజకీయ వేధింపులు, అక్రమ తొలగింపులను ఆపాలని డిమాండ్ చేశారు. ఏపీ వెలుగు ఉద్యోగుల సంఘం సీఐటీయూ విశాఖ జిల్లా కమిటీ గౌరవాధ్యక్షుడు పి.మణి, పలువురు యానిమేటర్లు పాల్గొన్నారు.

### స్కూల్ గేమ్స్‌లో శ్రీకృష్ణాపురం గురుకుల విద్యార్థుల ప్రతిభ



రాష్ట్ర స్థాయి పోటీల్లో ద్వితీయ స్థానం కైవసం చేసుకున్న శ్రీకృష్ణాపురంలోని అంబేడ్కర్ గురుకుల విద్యార్థులు

ఆరిలోవ, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : కర్నూలులో ఈ నెల 13 నుంచి 14 వరకూ స్కూలు ఫెడరేషన్ ఆధ్వర్యంలో కర్నూలు గుడ్ షెపర్డ్ స్కూలులో జరిగిన రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్‌టోర్నీలో మిని సబ్ జూనియర్ (అండర్-12) రాష్ట్ర స్థాయి పోటీల్లో శ్రీకృష్ణాపురం అంబేడ్కర్ గురుకుల విద్యార్థులు ద్వితీయ స్థానం సాధించినట్టు ప్రిన్సిపాల్ రత్నవల్లి తెలిపారు. వీరిలో 7వ తరగతి చదువుతున్న బి.రేవంత్ ఏపీ టీం నుంచి నేషనల్ మినీ సబ్ జూనియర్ పోటీలకు ఎంపికైనట్టు ఆమె తెలిపారు. ఈ పోటీలు హైదరాబాద్‌లో జరగనున్నట్టు చెప్పారు. ఈ పోటీల కోసం విద్యార్థులకు తర్ఫీదు ఇచ్చిన పీడీ సాగర్, విజయం సాధించిన విద్యార్థులను ప్రిన్సిపాల్ అభినందించారు.

### ఏసీఏ నూతన ఉపాధ్యక్షుడిగా నరసింహారావు

విశాఖపట్నం, స్పోర్ట్స్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా గుంటూరు న్యూ క్రికెట్ క్లబ్ సభ్యుడు బండారు నరసింహారావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జరిగిన ఏసీఏ వార్షిక సర్వసభ్య సమావేశంలో రిటర్నింగ్‌అధికారి నిమ్మగడ్డ రమేష్‌కుమార్ ఈ ఎన్నిక నిర్వహించారని ఏసీఏ అధ్యక్ష కాదర్శులు కేశినేని శివనాథ్ (చిన్ని), సానా సతీష్‌బాబు ఓ ప్రకటనలో తెలిపారు.

## జర్నలిస్టుల సమస్యలను అసెంబ్లీలో చర్చించాలి

### నగర ఎమ్మెల్యేలకు జర్నలిస్టు సంఘాల వినతి



గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుకు వినతి పత్రం అందిస్తున్న జర్నలిస్టు సంఘం ప్రతినిధులు

సీతంపేట, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): జర్నలిస్టుల సమస్యలను అసెంబ్లీలో చర్చించి పరిష్కరించాలని కోరుతూ జర్నలిస్టు సంఘాల ప్రతినిధులు నగర ఎమ్మెల్యేలకు మంగలవారం వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా సీతంపేటలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావును, సీతమ్మధారలో విశాఖ ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజును, శివాజీపాలెంలో దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్‌ను కలిసి జర్నలిస్టుల సమస్యలను చర్చించారు. ఈ సందర్భంగా ప్రెస్ అక్రిడేషన్ల జీవో నంబర్ 84ను సవరించి స్థానిక దినపత్రికలను అక్రిడేషన్లు పెంచాలని, జర్నలిస్టులకు నాలుగు సెంట్ల చొప్పున ఇళ్ల స్థలాలు, ఇతర రాష్ట్రాల్లో మాదిరిగా రూ.10 వేల పెన్షన్, ప్రమాద బీమా, జర్నలిస్టుల పై దాడుల నివారణకు, నియంత్రణ కమిటీలు పునరుద్ధరణ చేయాలని వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో లోకల్ న్యూస్ పేపర్స్ అసోసియేషన్ ప్రతినిధులు, ఇతర జర్నలిస్టులు పాల్గొన్నారు.

## అక్రమ నిర్మాణంపై అధికారుల చర్యలు

మాధవధార, సెప్టెంబరు 16 ( ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 51వ వార్డు మాధవధార రాజీవ్‌నగర్‌లోని అక్రమ నిర్మాణంపై జోన్-5 టౌన్ ప్లానింగ్ అధికారులు మంగళవారం చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా స్థానికంగా ఉన్న శ్రీ శాంతినికేతన్ స్కూల్ భవనం పై ఎలాంటి అనుమతులు లేకుండా కడుతున్న అదనపు అంతస్థును టౌన్‌ప్లానింగ్ సిబ్బంది కూల్చివేశారు. 289 సచివాలయం పరిధిలో చేపడుతున్న కట్టడాన్ని సచివాలయ ప్లానింగ్ సెక్రటరీ సోనియా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సిబ్బంది సాయంతో తొగించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ కట్టడానికి సంబంధించి ఎలాంటి ప్లాన్ అప్రూవల్ లేదని, పలు హెచ్చరికలు చేసినా ఎటువంటి స్పందన కనబడలేదని తెలిపారు. ఎలాంటి నాణ్యత ప్రమాణాలు పాటించకుండా, నిబంధనలకు విరుద్ధంగా అదనపు అంతస్థు నిర్మిచడంపై చర్యలు తీసుకున్నట్టు అధికారులు తెలిపారు.

## శరన్నవరాత్రి ఉత్సవాల బ్రోచర్ ఆవిష్కరణ



ఉత్సవాల బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణశ్రీనివాస్

మద్దిలపాలెం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : పూర్ణామార్కెట్‌లో వేంచేసియున్న దుర్గాలమ్మ అమ్మవారి శరన్నవరాత్రి మహోత్సవాల బ్రోచర్‌ను దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ మంగళవారం శివాజీపాలెంలోని తన క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వంశీకృష్ణశ్రీనివాస్ మాట్లాడుతూ వినాయకచవితి ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించుకున్న నగరవాసులు శరన్నవరాత్రి మహోత్సవాలు ఘనంగా చేపట్టాలన్నారు. ఈనెల 22 నుంచి వచ్చే నెల 2 వరకు జరగనున్న పూర్ణమార్కెట్‌లోని ఉత్సవాలకు అందరూ సహకారం అందించాలని, ఉత్సవాలకు తనవంతు పూర్తి సహాయసహకారాలు అందిస్తానని చెప్పారు. కార్యక్రమంలో ఆలయ ఈవో శేఖర్‌బాబు, మాజీ కార్పొరేటర్ పిల్లి రమణ, కూటమి నాయకులు లెంక త్రినాథ్, రాము, రఘు తదితరులు పాల్గొన్నారు.

# సమస్యలు పరిష్కరించాలని వినతులు



దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్‌కు వినతి పత్రం అందిస్తున్న భవన నిర్మాణ కార్మిక సంఘం ప్రతినిధులు



ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజుకు వినతి పత్రాన్ని అందిస్తున్న నక్కవానిపాలెం గ్రామస్తులు

- పెండింగ్‌లో ఉన్న 50వేల అభ్యర్థనలు పరిష్కరించాలి
- ఉత్తర ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజు, దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్‌కు వినతి పత్రాలు అందించిన భవన నిర్మాణ కార్మిక సంఘాలు

సీతమ్మధార, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ భవన, ఇతర నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డుల్లో పెండింగ్‌లో ఉన్న అభ్యర్థనలు వెంటనే పరిష్కరించాలని భవన నిర్మాణ కార్మిక సంఘం ఏఐటీయూసీ అనుబంధ సంస్థ ప్రతినిధులు ఉత్తరం ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు, దక్షిణం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్‌లకు మంగళవారం వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏపీ భవన, ఇతర నిర్మాణ సంక్షేమ బోర్డులో సభ్యులుగా ఉన్న కార్మికులు తమకు హక్కుగా రావాల్సిన సంక్షేమ పథకాల కోసం పెట్టుకున్న దాదాపు 50 వేల అభ్యర్థనలు పెండింగ్‌లో ఉన్నాయని, జగన్ హయాంలో జీవో నంబర్ 1214ను జారీ చేయడం వల్ల సంక్షేమ బోర్డును నిర్వీర్యం అయిందని వాపోయారు. దీనివల్ల తాము పెట్టుకున్న అభ్యర్థనలు పెండింగ్‌లో ఉన్నాయని అన్నారు. కూటమి అధికారంలో ఉండగానే పెండింగ్ ఉన్న అభ్యర్థనలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేయాల్సి ఉంటుందని తెలిపారు. భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించే విధంగా కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని, సమస్యలను సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ దృష్టికి తీసుకువెళతామని నాయకులు అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకుడు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పడాల రమణ, కోట సత్తిబాబు, ఎన్.సాయిబాబా, బోర రమణ, నాగేశ్వరరావు, నారాయణరావు, అప్పలరాజు, వాసు తదితరులు పాల్గొన్నారు.

### వందేళ్ల చెట్టును కాపాడాలి

ఉత్తర నియోజకవర్గంలోని 24వ వార్డు నక్కవానిపాలెంలో ఉన్న గ్రామ దేవత ఏడుగుళ్ల ముత్యాలమ్మ ఆలయం వద్ద సుమారు వందేళ్ల చరిత్ర కలిగిన మర్రి చెట్టు కొమ్మలను తొలగించారని గ్రామ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు దృష్టికి తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా కమిటీ అధ్యక్షుడు గుడ్ల కాటరాజు మాట్లాడుతూ ఏడుగుళ్ల ముత్యాలమ్మ అమ్మవారిని ఎన్నో ఏళ్లగా నక్కవానిపాలెం గ్రామసులు ఆరాధ్య దైవంగా కొలుస్తున్నామని, ఆలయ ప్రాంగణంలో ఉన్న మర్రి వృక్షాన్ని రక్షించాలని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. పూర్తి వివరాలు తెలుసుకుని సమస్యను పరిష్కరిస్తానని ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు హామీ ఇచ్చారు.

### సమాధులు ఉన్న స్థలాన్ని శుభ్ర పరచాలి

**మహారాణిపేట, (ఆంధ్రజ్యోతి):** జగదంబా జంక్షన్‌లో ఉన్న క్రిస్టియన్ పురాతన సమాధులు ఉన్న స్థలాన్ని శుభ్రపరచాలని 29వ వార్డు జనసేన అధ్యక్షుడు అంగటి శ్రావణ్ కుమార్ ఎమ్మెల్యే వంశీకృష్ణ, శ్రీనివాస్‌కు జోన్4 కమిషనర్ మల్లయ్యానాయుడుకు మంగళవారం వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగదంబా జంక్షన్ ప్రాంగణంలో పూర్వకాలం నాటి విదేశీయుల సమాధుల స్థలం ఉన్నదని, ఇప్పుడా స్థలంలో చెట్లు గుబురుగా పెరిగిపోవడంతో మందుబాబులకు, గంజాయి బ్యాచ్‌కు అడ్డాగా మారిందని అన్నారు. అంతేకాకుండా ఈ స్థలంలో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతోందని అన్నారు. దీంతో ఈ స్థలాన్ని శుభ్రపరిచి విద్యుత్ దీపాలతో అందంగా తీర్చిదిద్దాలని కోరారు. ఈ స్థలంలో పురాతమైన సమాధులు ఉన్నా అందమైన పార్కుగా తీర్చిదిద్దవచ్చన్నారు. అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో క్రిస్టియన్ మైనారిటీ కౌన్సిల్ చైర్మన్ ముకాన సుధాకర్, కార్యదర్శి జేమ్స్ కుంపట్లతో పాటు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ప్రపంచ బార్బర్ దినోత్సవం



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న గండి బాబ్జీ

కంచరపాలెం,సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): ప్రపంచ బార్బర్ దినోత్సవం సందర్భంగా కంచరపాలెం ఏరియా ఆర్కె సోషల్ సర్వీసెస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ వ్యవస్థాపకుడు మల్లు వలస రాధాకృష్ణ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా జిల్లా టీడీపీ అధ్యక్షుడు గండి బాబ్జీ పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా గండి బాబ్జి మాట్లాడుతూ ఆర్‌కే వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చేపడుతున్న సేవాకార్యక్రమాలను కొనియాడారు. కార్యక్రమంలో స్థానిక కూటమి నాయకులు పాల్గొన్నారు.

## డీజిల్ లోకోషెడ్‌లో డీఆర్‌ఎం తనిఖీలు



డీజిల్ లోకోషెడ్‌లో తనిఖీలు చేస్తున్న డీఆర్‌ఎమ్ లలిత్ బొహ్రా

విశాఖపట్నం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): డీజిల్ లోకోషెడ్‌లో డీఆర్‌ఎం లలిత్ బొహ్రా మంగళవారం తనిఖీలు చేశారు. ఆరు నెలలుగా డీజిల్ లోకోషెడ్ పనితీరును సమీక్షించారు.సరకు రవాణాలో లోడింగ్ సామర్థ్యాన్ని పెంచడానికి సిమెన్స్ నేతృత్వంలో 300 లోకోమోటివ్‌ల నిర్వహణ లక్ష్యంగా చేపట్టిన ప్రాజెక్టు పురోగతిని సమీక్షించారు. పెరుగుతున్న డిమాండ్‌కు అనుగుణంగా అవసరమైన మౌలిక సదుపాయాల అభివృద్ధికి సంబంధించి మాస్టర్ ప్లాన్ రూపొందించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం సీనియర్ డివిజనల్ ఫైనాన్స్ మేనేజర్ ఎం.హరినాథ్‌తోపాటు ప్రణాళిక ప్రాజెక్టులకు సంబంధించిన కీలక అధికారులు, సూపర్‌వైజర్లతో సమావేశమై పలు అంశాలపై చర్చించారు.

## రైల్వే జోన్ కార్యాలయం పనులు పరిశీలించిన జీఎం

- పనులు ఆగకుండా పర్యవేక్షించాలని అధికారులకు ఆదేశం



ముడసర్లోవలో రైల్వే నిర్మాణాలను ఇతర అధికారులతో కలిసి పరిశీలిస్తున్న జీఎం సందీప్ మాథుర్

విశాఖపట్నం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ముడసర్లోవలో దక్షిణ కోస్తా రైల్వే జోన్ కేంద్ర కార్యాలయం నిర్మాణ పనులను మంగళవారం జనరల్ మేనేజర్ సందీప్ మాథుర్ పరిశీలించారు. మొత్తం ఎన్ని విభాగాలుగా పనులు చేపడుతున్నారు?, ఏ పనిని ఎంత కాలంలో పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు?, అవసరమైనంత మంది కార్మికులు, సాంకేతిక నిపుణులు అందుబాటులో ఉన్నారా? లేదా?...అనే అంశాలను అడిగి తెలుసుకున్నారు. సైట్ ప్లాన్‌ను, అక్కడి నిర్మాణాలను తనిఖీ చేశారు. ఆగకుండా పనులు కొనసాగించాలని, నిత్యం పర్యవేక్షణ కూడా చేయాలని అధికారులకు సూచించారు. ఈ పర్యటనలో ప్రిన్సిపల్ చీఫ్ ఇంజనీర్ అంకుశ్ గుప్తా, దక్షిణ కోస్తా జోన్ ఓఎస్‌డీ చంద్రశేఖర్, కనస్ట్రక్షన్ చీఫ్ ఇంజనీర్ డి.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

## నాలుగు కళాశాలలపై కొరడా

... 5వ పేజీ తరువాయి

తనిఖీ సమయంలో 25 మంది కూడా లేరు. అలాగే, ఫ్యాకల్టీ 26 మంది ఉన్నట్టు రిజిస్టర్‌లో నమోదు చేశారు. కానీ, అధికారులు తనిఖీలు సమయంలో ఆరుగురు మాత్రమే ఉన్నారు. మిగిలినవారి గురించి అధికారులు ప్రశ్నించగా లీవ్‌లో ఉన్నట్టు పేర్కొన్నారు. అలాగే, భీమిలిలోని విశాఖ లా కాలేజీలో బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సూచనలకు అనుగుణంగా క్లాస్ రూమ్‌లు, మ్యూట్ కోర్టులు, ఆఫీస్ రూమ్‌లు, ఫర్నీచర్ లేనట్టు గుర్తించారు. 2016 నుంచి 2022 మధ్య కాలానికి సంబంధించిన అటెండెన్స్ రిజిస్టర్‌లు కూడా లేనట్టు నిర్ధారించారు. అలాగే, మధురవాడలోని ప్రేమ బీఈడీ కాలేజీని నేషనల్ కౌన్సిల్ ఫర్ టీచర్ ఎడ్యుకేషన్ (ఎన్‌సీటీ), ఏయూ, ఉన్నత విద్యా మండలి అనుమతి లేకుండానే క్యాంపస్‌ను మరోచోటకు మార్చేశారు. పలువురు ఉద్యోగులను అకస్మాత్తుగా తొలగించి వారికి జీతాలు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేయడంతోపటు రిలీవింగ్ సర్టిఫికెట్లు ఇవ్వకుండా వేధిస్తున్నారు. టీచింగ్ ఫ్యాకల్టీ కూడా సరిగా లేరని, ప్రిన్సిపాల్‌కు అర్హతలు లేవని, తరగతి గదులు సరిగా లేవని గుర్తించారు. అలాగే, చీపురుపల్లిలోని సెయింట్ మేరీ కాలేజీ ఆఫ్ ఎడ్యుకేషన్‌లోనూ క్లాస్ రూములు సరిగా లేవని, గదుల్లోకి వెంటిలేషన్ రావడం లేదని, ల్యాబ్, నీరు, గ్రౌండ్ సదుపాయాలు లేవని అధికారులు గుర్తించారు. ఈ నేపథ్యంలో ఈ ఏడాది ప్రవేశాలు నిలిపివేయడంతోపాటు చర్యలు ఎందుకు తీసుకోకూడదో తెలియజేయాలంటూ అధికారులు షోకాజ్ నోటీసులను జారీ చేశారు. వారం రోజుల్లో సదరు కాలేజీ యాజమాన్యాలు ఇచ్చే వివరణను బట్టి తదుపరి చర్యలు తీసుకోనున్నారు. ఈ విషయమై ఏయూ వైస్ చాన్సలర్ జీపీ రాజశేఖర్ మాట్లాడుతూ ఏయూ పరిధిలోని కాలేజీలు నిబంధనలు అతిక్రమించి వ్యవహరిస్తే చర్యలు తప్పవన్నారు. కాలేజీల నిర్వహణలో కీలకమైన అంశాలను క్షుణ్ణంగా పరిశీలిస్తామని, మౌలిక సదుపాయాలు, ఫ్యాకల్టీ, విద్యార్థుల అవసరాలు వంటి అంశాల్లో రాజీ లేదన్నారు. ముఖ్యంగా విద్యార్థులు రాకుండా హాజరువేయడం వంటి చర్యలకు పాల్పడితే కఠినంగా వ్యవహరిస్తామన్నారు. వీటికి అడ్డుకట్ట వేసేందుకు ఎఫ్‌ఆర్‌ఎస్ విధానాన్ని అనుబంధ కాలేజీల్లో అమలు చేయాలని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినట్టు వెల్లడించారు. సీడీసీ డీన్ టీవీ కృష్ణ మాట్లాడుతూ నిబంధనలను అతిక్రమించిన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. షోకాజ్ నోటీసులు ఇచ్చిన వారి నుంచి వివరణ తీసుకుని తదుపరి చర్యలు ఉంటాయన్నారు. రానున్న రోజుల్లో వీసీ ఆదేశాల మేరకు ఇతర అనుబంధ కాలేజీల్లో తనిఖీలు నిర్వహిస్తామన్నారు.

## పేదల ఇళ్ల కాలనీల్లో తాగునీటికి రూ.640 కోట్లు

... 5వ పేజీ తరువాయి

గడచిన మూడు నెలల్లో జిల్లా అభివృద్ధి రేటు సాధించామని, రానున్న కాలంలో అదే వృద్ధి సాధిస్తామన్నారు. సర్వీస్ సెక్టార్‌లో జిల్లా రెండో స్థానంలో ఉందన్నారు. వస్తువుల ఉత్పత్తిలో బెంచ్ మార్కుకు చేరుకున్నామని, పారిశ్రామిక వృద్ధి రేటు 10 శాతం లక్ష్యం కాగా ఇప్పటికే 9.97 శాతం సాధించామని కలెక్టర్ తెలిపారు.

### పోలీస్ కమిషనర్‌కు సీఎం అభినందన

ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న హత్య కేసులను ఛేదించడంలో ఉత్తమ పనితీరు కనబరిచిన నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రతబాగ్చిని సీఎం చంద్రబాబునాయుడు అభినందించారు. అమరావతిలో మంగళవారం అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, పోలీస్ కమిషనర్లతో సీఎం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విశాఖ పోలీస్ కమిషనర్ శంఖబ్రతబాగ్చి నగరంలో తమ విభాగం పనితీరు గురించి వివరించారు. మూడేళ్ల కిందట కంచరపాలెం స్టేషన్ పరిధిలో జరిగిన స్క్రాప్ వ్యాపారి హత్య కేసును ఇటీవల తాము ఛేదించినట్టు చెప్పారు. అలాగే ఎయిర్‌పోర్టు స్టేషన్ పరిధిలో మహిళ మిస్సింగ్ కేసు మూడేళ్ల పాటు పెండింగ్‌లో ఉండిపోయిందని, తాను ప్రత్యేక చొరవ తీసుకొని కేసు దర్యాప్తు చేయగా ఆమెను కొందరు హత్య చేసినట్టు తేలిందన్నారు. ఆ కేసులో నిందితులను అరెస్టు చేసి రిమాండ్ పంపించామని వివరించారు. దీంతో సీఎం స్పందిస్తూ పెండింగ్ కేసుల దర్యాప్తులో విశాఖ పోలీస్ కమిషనర్‌ను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. జిల్లాల్లో పెండింగ్ కేసులను క్లియర్ చేయాలని ఆదేశించారు. విశాఖపట్నం నగరం మహిళలకు సురక్షిత నగరంగా గుర్తింపు పొందడం పట్ల సీపీని సీఎం అభినందించారు.

## కాలనీ సమగ్ర అభివృద్ధికి చర్యలు చేపడతాం

- ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజు



కాలనీలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు

మురళీనగర్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఉత్తర నియోజకవర్గం 51వవార్డులోని ఏళ్లగా అభివృద్ధికి దూరంగా ఉన్న ఏకలవ్యకాలనీ రూపు రేఖలు సమూలంగా మార్చేదిశగా అధి కారులు సమన్వయంతో పనిచేయాని ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు పేర్కొన్నారు. మాధవధా ర ఆర్టీఏ ఆఫీసు రోడ్డులో హైవే పక్కనే ఉన్న ఈ కాలనీలో మంగళవారం సాయంత్రం ఆయ న పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీలో ఇప్పటికీ మౌలిక సదుపాయాలు లేకపోవడం సమర్థనీయం కాదన్నారు. ఇక్కడున్న ఖాళీ స్థలంలో ప్రాథమిక ఆరోగ్యకేంద్రం, ఒక కమ్యూనిటీ హాలు నిర్మాణాలు, రహదారులను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయాలని ఎమ్మెల్యే అధికారులకు ఆదేశించారు. ప్రధానంగా కాలనీలోని ప్రశాంత వాతావరణం నెలకొనేటా చూడాలని ఎయిర్‌పోర్టు జోన్ సీఐ ఉమామహేశ్వరరావుకు సూచించారు. కాలనీలోని శాంతి భద్రతలు కాపాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, జీవీఎంసీ జోన్-5 జడ్సీ బి.రాము, జనసేన 51వ వార్డు ప్రెసిడెంట్ జి.అప్పారావు, కాలనీ అసోసియేషన్ పెద్దలు, స్థానిక కూటమి నాయకులు పాల్గొన్నారు.

## ప్రపంచ సీనియర్ బ్యాడ్మింటన్ టోర్నీలో లింగేశ్వరరావుకు రజతం



లింగేశ్వరరావు

విశాఖపట్నం, స్పోర్ట్స్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): అత్యంత ప్రతిష్ఠాత్మక వరల్డ్ సీనియర్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ టోర్నీలో నగరానికి చెందిన అంతర్జాతీయ షట్లర్ బీవీఎస్‌కే.లింగేశ్వరరావు రజత పతకాన్ని సాధించారు. థాయిలాండ్‌లో జరిగిన ఈ టోర్నీలో 55 ప్లస్ మిక్స్‌డ్ డబుల్స్‌లో పార్టనర్ సజన్ వింగ్లెట్‌తో కలిసి అద్భుతంగా రాణించి రజత పతకాన్ని సొంతం చేసుకున్నారు. సెమీస్‌లో చైనీస్ తైపేకు చెందిన సుజెఎల్-హచ్ కువో జంటపై 21-19, 21-17 స్కోరుతో వరుస సెట్లలో విజయం సాధించి ఫైనల్స్‌కు చేరుకున్నారు. సోమవారం జరిగిన ఫైనల్స్‌లో డెన్మార్క్‌కు చెందిన సోరెన్సెన్-అండర్సన్ జంటపై పోరాడి 2-1 స్కోరుతో రెండో స్థానంలో నిలిచారు. ఈ మ్యాచ్‌లో తొలి సెట్‌ను 22-20 స్కోరుతో దక్కించుకున్న లింగేశ్వరరావు జంట, తర్వాత రెండు సెట్లలోని ఆధిక్యాన్ని కొనసాగించలేకపోయారు. ఈ టోర్నీలో ప్రపంచ వ్యాప్తంగా 192 దేశాల నుంచి షట్లర్లు పాల్గొనగా భారత్ నుంచి 90 మంది ప్రాతినిధ్యం వహించారు. భారత్ క్రీడాకారులకు కేవలం ఏడు పతకాలు మాత్రమే దక్కగా, వాటిలో నగరానికి చెందిన లింగేశ్వరరావుకు రజత పతకం దక్కింది.

## టీడీపీ 54వ వార్డు అధ్యక్షుడిగా కుట్టా కార్తీక్



కుట్టా కార్తీక్

కంచరపాలెం,సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 54వ వార్డు టీడీపీ అధ్యక్షుడిగా సీనియర్ నాయకుడు కుట్టా కార్తీక్‌ను నియమించారు. ఈ మేరకు ఎంపీ శ్రీభరత్, జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జి నియామక పత్రాన్ని మంగళవారం అందించారు. ఈ సందర్భంగా కార్తిక్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో అధ్యక్ష పదవికి ఎంపిక చేసినందుకు ధన్యవాదాలు తెలిపారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని, ప్రభుత్వ లక్ష్యాలను ప్రజల్లోకి తీసుకువెళతానని అన్నారు. వార్డు ప్రధాన కార్యదర్శిగా ఉప్పాడ శేఖర్‌ను నియమించారు. ఈ సందర్భంగా పలువురు వీరిని అభినందించి శుభాకాంక్షలు తెలియజేశారు.

## కొండవాలుపై కన్ను

... 5వ పేజీ తరువాయి

స్వభావం ప్రభుత్వ భూమిగా, వర్గీకరణ కింద కొండ/గుట్టగా నమోదుచేశారు. వ్యవసాయేతర భూమిగా గుర్తించారు. చాలాకాలం క్రితం కొండ సమీపంలో 30 నుంచి 40 ఎకరాల మేర ఇతర గ్రామాలకు చెందిన వారికి డి.పట్టాలు ఇచ్చారు. ఆ పట్టాలకు సంబంధించి భూమితో పాటు జిరాయితీ భూములను కొంతమంది పెద్దలు కొనుగోలు చేశారు. వాటిల్లో తోటలు పెంచుతున్నారు. ఇప్పుడు ఆ తోటలకు ఆనుకుని ఉన్న కొండవాలు ప్రాంతంపై కన్నేశారు. వారం రోజులగా చెట్లు తొలగించి చదును చేస్తున్నా ఎందుకొచ్చిన గొడవని గ్రామస్థులెవరూ మాట్లాడడం లేదు. ఒకరిద్దరు గ్రామ రెవెన్యూ అధికారికి ఫిర్యాదుచేసినా పట్టించుకోలేదనే వాదన వినిపిస్తోంది. రెవెన్యూ అధికారులకు భారీగా ముడుపులు అందడమే అందుకు కారణమనే ప్రచారం గ్రామంలో జోరుగా సాగుతుంది.

## సెంట్రల్ ఎక్సైజ్ సూపరింటెండెంట్‌కు జైలు శిక్ష

... 5వ పేజీ తరువాయి

వీలుగా తాము సృష్టించిన నకిలీ పత్రాలతో దరఖాస్తు చేయించి విశాఖలోని వీఎస్‌ఈజెడ్ నుంచి అన్ని అనుమతులూ పొందారు. గోడౌన్ ఏర్పాటుకు స్థలాన్ని కూడా సంపాదించారు. వీటి ఆధారంగా మాలేగావ్‌లోని మూడు సంస్థల నుంచి పన్ను మినహాయింపు కలిగిన ముడిసరుకును దిగుమతి చేసుకున్నారు. తర్వాత వాటిని ఎగ్జిమ్ పాలసీ/అడ్వాన్స్ రిలీజ్ ఆర్డర్ (ఏఆర్ఓ) నిబంధనలకు విరుద్ధంగా ముంబైలోని మూడు సంస్థలకు ఎగుమతి చేశారు. దీనివల్ల కేంద్ర ప్రభుత్వానికి పన్ను రూపేణా రావాల్సిన సుమారు రూ.32.28 కోట్ల ఆదాయానికి గండిపడింది. దీనిపై సీబీఐ అధికారులు గతంలోనే కేసు నమోదుచేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. ఈ కేసులో కె.రాందాస్, పోలాకి జానకిరామ్‌ను నిందితులుగా నిర్ధారిస్తూ, ఐదేళ్ల జైలుశిక్ష, జరిమానా విధించింది. రాందాస్, జానకిరామ్‌లను కేంద్ర కారాగారానికి తరలించినట్టు సీబీఐ అధికారులు పేర్కొన్నారు.

## నేడు సీఎం రాక

... 5వ పేజీ తరువాయి

మంత్రి నిర్మలా సీతారామన్‌తో కలిసి గ్లోబల్ కేపబులిటీ సెంటర్ వ్యాపార సదస్సులో పాల్గొంటారు. అనంతరం సాయంత్రం 5 నుంచి 6 గంటల వరకు అక్కడే సరయు హాలులో ఫ్రెంచ్ ప్రతినిధులతో, ఆ తరువాత శారదా హాలులో నెదర్లాండ్స్ బృందంతో చర్చిస్తారు. రాత్రి ఏడు గంటలకు అక్కడి నుంచి బయలుదేరి విమానాశ్రయానికి చేరుకుంటారు. 7.45 గంటలకు విమానంలో బయలుదేరి విజయవాడ వెళతారు.

# ఆటో డ్రైవర్లకు భరోసా

... 5వ పేజీ తరువాయి

అంటే రూ.15 వేల చొప్పున చెల్లించనున్నట్టు ప్రకటించింది. దరఖాస్తుల స్వీకరణ, లబ్ధిదారుల ఎంపికపై రవాణా శాఖ అధికారులకు విధి విధానాలను జారీ చేసింది.

### ఎవరు అర్హులు?

ఆటోరిక్షా, మోటారు క్యాబ్, మ్యాక్సీక్యాబ్‌ను సొంతంగా నడుపుకుంటూ కుటుంబాన్ని పోషించుకునే వారికే ఈ పథకం వర్తిస్తుంది. ఆధార్ కార్డు, బియ్యం రేషన్ కార్డు ఉండాలి. ఏపీ రవాణా శాఖ జారీచేసిన డ్రైవింగ్ లైసెన్స్ ఉండాలి. వాహనం రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్, ఫిట్‌నెస్, ట్యాక్స్ వంటివి చెల్లుబాటు అయ్యే రికార్డులు ఉండాలి. ఆటోలకు ఒక నెలలోపు తీసుకున్న ఫిట్‌నెస్ సర్టిఫికెట్ తప్పనిసరి. ప్రయాణికులను చేరవేసే వాహనాలు నడిపేవారు మాత్రమే ఈ పథకానికి అర్హులు. సరకు రవాణా వాహనాలు నడిపేవారు ఈ పథకానికి అర్హులు కారు. ఒక కుటుంబంలో ఒక వాహనానికి మాత్రమే పథకం వర్తిస్తుంది. ఇతర వృత్తి సంబంధిత ప్రభుత్వ పథకాల్లో లబ్ధిదారులు అయితే.. ఈ పథకానికి అనర్హులుగా పరిగణిస్తారు. దరఖాస్తుదారుల కుటుంబ సభ్యుల్లో ప్రభుత్వ ఉద్యోగులు లేదా ఉద్యోగ విరమణ చేసినవారు ఉండకూడదు. అయితే పారిశుధ్య కార్మికుల కుటుంబాలకు వెసులుబాటు కల్పించారు. ఆదాయ పన్ను చెల్లింపుదారులు, నెలకు 300 యూనిట్లకంటే ఎక్కువ (12 నెలల సగటు) విద్యుత్ వినియోగించేవారు, పల్లం భూమి మూడు ఎకరాలు, మెట్ట పది ఎకరాలకు మించి ఉన్నవారు ఈ పథకానికి అనర్హులవుతారు. పట్టణ ప్రాంతంలో 1,000 చదరపు అడుగుల కంటే ఎక్కువ విస్తీర్ణంలో నివాస భవనం వున్నవారు, లీజు/ అద్దెకు తీసుకుని వాహనాలు, ఆర్టీఓ చలానాలు బాకీ ఉన్న వాహనాలు ఈ పథకం కిందకు రావు.

### దరఖాస్తుకు మూడు రోజులే గడువు

అర్హులైన ఆటో రిక్షా, మోటారు క్యాబ్, మ్యాక్సీక్యాబ్‌ల డ్రైవర్లు బుధవారం నుంచి జీఎస్‌డబ్ల్యూఎస్ పోర్టల్‌లో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. ఈ నెల 19వ తేదీ వరకే గడువు ఉంది. అందిన దరఖాస్తులపై గ్రామ/వార్డు సచివాలయాల సిబ్బంది 22వ తేదీన క్షేత్రస్థాయిలో విచారణ జరుపుతారు. ఎంపీడీఓలు/జీవీఎంసీ జోనల్ కమిషనర్‌లు తుది జాబితాలను కలెక్టర్‌కు పంపారు. అర్హుల జాబితాను ఈ నెల 24వ తేదీన ప్రకటిస్తారు. ఈ పథకానికి అర్హులుగా ఎంపికైన వారికి దసరా పండుగ రోజున బ్యాంకు ఖాతాలో నగదు జమ అవుతుంది.

## విశాఖలో సింగపూర్ తరహా పర్యాటక అభివృద్ధి

... 5వ పేజీ తరువాయి

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఏ విధంగా వినియోగించుకోవచ్చునో వారిని అడిగి తెలుసుకున్నారు. సింగపూర్ ప్రభుత్వం అమలుచేస్తున్న సస్టెయినబుల్ టూరిజం విధానాలు, ప్రమాణాలు, వ్యర్థాల నిర్వహణ, నీటి సంరక్షణ వంటివి పరిశీలించారు. విశాఖపట్నంలో ఆర్‌కే బీచ్, కైలాసగిరి వంటి పర్యాటక కేంద్రాలను ప్రపంచ స్థాయి ప్రమాణాలతో తీర్చిదిద్దడానికి చేపట్టాల్సిన పర్యావరణ అంశాలపై చర్చించారు. ఇంటర్నేషనల్ ఈవెంట్ల నిర్వహణకు అనుగుణంగా విశాఖపట్నాన్ని ఏ విధంగా అభివృద్ధి చేయాలనే దానిపై ఆలోచనలు పంచుకున్నారు. ఈ పర్యటన విశాఖ పర్యాటక అభివృద్ధికి దోహదపడుతుందన్నారు.

## మహిళలకు ఆరోగ్య రక్ష

... 5వ పేజీ తరువాయి

శాఖ, మహిళా శిశు సంక్షేమ, పంచాయతీరాజ్, మునిసిపల్, డీఆర్‌డీఏ, విద్యా శాఖ అధికారుల సహకారం, సమన్వయంతో ఈ ప్రోగ్రామ్‌ను అమలు చేయనున్నారు. ఈ పరీక్షల నిర్వహణకు జిల్లాలో 135 క్యాంపులను నిర్వహించనున్నారు. ఆయా క్యాంపుల్లో 10,56,000 మంది మహిళలకు పరీక్షలు నిర్వహించేలా అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఇందుకోసం 236 మంది స్పెషలిస్టు వైద్యులను కేటాయించారు. మరో 20 మంది ప్రాజెక్టు ఆఫీసర్లు, 159 మంది స్టాఫ్ నర్సులు, 75 మంది ఫార్మసిస్టులు, 75 మంది ల్యాబ్ టెక్నీషియన్స్‌ను నియమించారు.

## ఏసీఏ నూతన ఉపాధ్యక్షుడిగా నరసింహారావు

విశాఖపట్నం, స్పోర్ట్స్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా గుంటూరు న్యూ క్రికెట్ క్లబ్ సభ్యుడు బండారు నరసింహారావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జరిగిన ఏసీఏ వార్షిక సర్వసభ్య సమావేశంలో రిటర్నింగ్‌అధికారి నిమ్మగడ్డ రమేష్‌కుమార్ ఈ ఎన్నిక నిర్వహించారని ఏసీఏ అధ్యక్ష కార్యదర్శులు కేశినేని శివనాథ్ (చిన్ని), సానా సతీష్‌బాబు ఓ ప్రకటనలో తెలిపారు.

## టీడీపీ కార్యకర్త కుటుంబానికి బీమా పరిహారం



మృతిచెందిన టీడీపీ కార్యకర్త కుటుంబానికి చెక్కు అందజేస్తున్న విశాఖ పార్లమెంటు అధ్యక్షుడు గండి బాబ్జీ

విశాఖపట్నం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 48వ వార్డు ఇందిరానగర్‌కు చెందిన తెలుగుదేశం పార్టీ కార్యకర్త కందిపల్లి శాంతి కుటుంబానికి విశాఖ పార్లమెంటు అధ్యక్షుడు గండి బాబ్జీ మంగళవారం రూ.5 లక్షల చెక్కు అందజేశారు. పార్టీ కుటుంబ సభ్యులు మరణిస్తే ప్రమాద బీమా రూపంలో ఆదుకుంటామన్నారు. టీడీపీ కుటుంబ సభ్యులకు ఈ బీమా సదుపాయం అందిస్తున్న పార్టీ అధినేత చంద్రబాబునాయుడు, జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

### ఉచిత వైద్య శిబిరానిక స్పందన

సీతమ్మధార, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక గాంధీనగర్‌లో ఉన్న డాక్టర్ రహమతుల్లా ఆసుపత్రిలో మంగవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానకి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా శిబిరంలో 200 మంది రోగులకు పరీక్షలు చేయించుకున్నారు. మధుమేహం, థైరాయిడ్, హెచ్‌బీ వంటి పరీక్షలు నిర్వహించారు



సమావేశంలో మాట్లాడుతున్న జగ్గునాయుడు

## భూ కేటాయింపులను రద్దు చేయాలి

**సిమెంట్ యూనిట్‌కు అనుమతులను నిలిపివేయాలి**

**సీపీఎం జిల్లా కార్యదర్శి జగ్గునాయుడు**

పెదగంట్యాడ, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): అదానీ గంగవరం గ్రైడింగ్ సిమెంట్ యూనిట్‌కు భూ కేటాయింపులతో పాటు అనుమతులను రద్దు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు డిమాండ్ చేశారు. సీఐటీయూ జిల్లా కార్యాలయంలో మంగళవారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ జనావాసాలకు దూరంగా ఇలాంటి పరిశ్రమలను ఏర్పాటు చేయాలన్నారు. పెదగంట్యాడ మండలంలో సుమారు 20 ఎకరాల భూమిని అదానీ మెస్సర్స్ అంబుజా సిమెంట్స్ లిమిటెడ్‌కు, గంగవరం సిమెంట్ గ్రైడింగ్ యూనిట్ ఏర్పాటుకు భూమిని కేటాయించేందుకు ప్రభుత్వం సిద్ధపడుతుందని, ఇందుకోసం అక్టోబరు 8న ప్రజాభిప్రాయ సేకరణ చేయనున్నట్టు ఏపీ కాలుష్య నియంత్రణ మండలి ప్రకటన విడుదల చేసిందన్నారు. ఇలాంటి పరిశ్రమ ఏర్పాటు వల్ల పెదగంట్యాడ, గాజువాక, శ్రీహరిపురం ప్రాంతాలు కాలుష్యం కోరల్లో చిక్కుకుంటాయన్నారు. అందువల్ల ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌లు జోక్యం చేసుకుని భూ కేటాయింపులను రద్దు చేయాలన్నారు. సమావే శంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్‌కేఎస్‌వీ కుమార్, వి.కృష్ణారావు పాల్గొన్నారు.

### నేటి నుంచి సేవా పక్షోత్సవాలు

గాజువాక, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ జన్మదిన వేడుకలను పురస్కరించుకుని గాజువాక నియోజకవర్గంలో బుధవారం నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు సేవా పక్షోత్సవాలను నిర్వహిస్తామని బీజేపీ గాజువాక ఇన్‌చార్జి కరణంరెడ్డి నరసింగరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా బుధవారం పాత గాజువాకలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఇలా ప్రతిరోజూ పలు సేవా కార్యక్రమాలను చేపడతామన్నారు.

### ఐటీఐలో మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

గాజువాక, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): స్టీల్ సిటీ ప్రభుత్వ ఐటీఐలో మిగుల సీట్లను భర్తీ చేసేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ కేఎస్ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 27వ తేదీలోగా ఆసక్తి గల అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎనిమిదో తరగతి ఉత్తీర్ణులైనవారు కార్పెంటర్, ప్లంబర్, పెయింటర్, మేషన్స్ కోర్సుల్లో చేరే అవకాశం ఉందన్నారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు 29న ఐటీఐలో జరిగే సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు హాజరుకావాలని సూచించారు. మరిన్ని వివరాలకు ఐటీఐను సంప్రదించాలని కోరారు.

### సినిమా గైడ్

- **మిరాయి** : జగదాంబ, మెలోడీ, శరత్, కామేశ్వరి, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), కన్య (గాజువాక), ఎస్.వి.సి.లిఖిత (శ్రీహరిపురం) అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- **కిష్కింధపురి** : లీలామహల్, సంగం, శ్రీరామా, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), మినీ మోహిని (గాజువాక),
- **అర్జున్ చక్రవర్తి** : రమాదేవి,
- **మదరాసి** : శ్రీకన్య
- **ఘాటీ** : కిన్నెర, వెంకటేశ్వర-2, గోకుల్, ముక్తాస్, మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక) లిఖిత (శ్రీహరిపురం)
- **పరదా** : , శ్రీకన్య-2 (గాజువాక)
- **కూలీ** :వెంకటేశ్వర-1, అరుణ (పెదగంట్యాడ),
- **మహావతార్ నరసింహ** : లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా),

### రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 14, టమాటా 18, వంకాయలు (తెలుపు) 42, వంకాయలు (నలుపు) 42, బెండకాయలు 18, పచ్చిమిర్చి 40, కాకరకాయలు 34, బీరకాయలు 32, ఆనపకాయ 16, కాలీఫ్లవర్ 32, క్యాబేజి 16, క్యారెట్ 44, దొండకాయలు 34, బంగాళ దుంపలు 19, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 34, అల్లం (పాతది) 70, బరబాటి 32, ముల్లంగి 36, నిమ్మకాయలు (కిలో) 65, బద్దచిక్కుడు 50, దోస కాయలు 24, వెల్లుల్లి (పెద్దవి) 70, కొబ్బరికాయ (పెద్దది) 35, బీన్స్ (పెన్సిల్) 50, కీరదోస 32, కాప్సికమ్ 58, పొట్లకాయ (పెద్దది) 24, చేమదుంపలు 32, చిలగడదుంపలు 35, కంద 40, దేముడు చిక్కుడు 66, గోరు చిక్కుడు 28, కూర పెండలం 26, బ్రకోలి 45, పనసపొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్ద కట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 5, పాల కూర (కట్ట) 5, తోటకూర (కట్ట) 5, మామిడికాయలు 80, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 24, మామిడి అల్లం 56, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 70.

| కోడిగుడ్లు (నెక్) | |
|---|---|
| (వంద - రూ.లలో) | |
| విశాఖపట్నం | 555 |
| విజయనగరం | 559 |
| శ్రీకాకుళం | 559 |

| చికెన్ ధరలు | |
|---|---|
| బ్యాగ్ | |
| రైతు ధర | 130 |
| లైవ్ ధర | 150 |
| విత్ స్కిన్ | 270 |
| స్కిన్‌లెస్ | 280 |

# సూపర్ సిక్స్.. సూపర్ హిట్

తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు



87వ వార్డులో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన పల్లా శ్రీనివాసరావు

కూర్మన్నపాలెం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): సూపర్ సిక్స్.. సూపర్ హిట్ అయిందని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. 87వ వార్డు పరిధి పకీరుతక్యాలో మంగళవారం సుమారు రూ.2 కోట్ల 70 లక్షలతో రిటెయినింగ్ వాల్స్, బీటీ, సీసీ రోడ్లు, డ్రెయిన్ల అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా పల్లా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ప్రతి గ్రామం, నగరంలో అభివృద్ధి పనులు పరుగులు పెడుతున్నాయన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఆర్థిక వ్యవస్థ ఛిన్నాభిన్నమైనా తాము అధికారంలోకి వచ్చాక ప్రతి హామీని నెరవేరుస్తున్నామన్నారు. సీఎం చంద్రబాబునాయుడు న్యాయకత్వంలో కూటమి ప్రభుత్వం నగరాభివృద్ధికి విశేష కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ 86వ వార్డు అధ్యక్షుడు నల్లూరు సూర్యనారాయణ, కూటమి నాయకులు వేగుంట శ్రీనివాస్, కాదా శ్రీను, ఎం.గణపతి, బొడ్డేడ జగదీశ్, కొర్లాన రమేశ్, గంధం వెంకటరావు, ఎం.సుబ్బయ్య, వెంకటేశ్, తదితరులు పాల్గొన్నారు.

**ఆటో కార్మికులను ఆదుకోవాలని 'పల్లా'కు వినతి**

**గాజువాక:** ఆటో కార్మికులను ఆదుకోవాలని కోరుతూ టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుకు ఇక్కడి పార్టీ కార్యాలయంలో గాజువాకకు చెందిన ఆటో యూనియన్ నాయకులు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఆటో డ్రైవర్లకు అవుట్‌సోర్సింగ్‌లో ఉపాధి కల్పించాలని, ఇన్సూరెన్స్‌లో యాభై శాతం రాయితీ కల్పించాలని, సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని, డ్రైవర్ల ఉనికికే ప్రశ్నార్థకంగా మారిన జీవో నంబర్లు 21,31లను వెంటనే రద్దు చేయాలని విజ్ఞప్తి చేశారు.

**అవుట్‌లెట్ నిర్మించాలని..**

**అక్కిరెడ్డిపాలెం:** నాతయ్యపాలెం కృష్ణ మహంతి చెరువు నీటితో పాటు నాతయ్యపాలెంలోని వాడుక నీరు బయటకు పోయేలా అవుట్‌లెట్ నిర్మించాలని కోరుతూ గాజువాకలోని టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుకు నాతయ్యపాలెం అభివృద్ధి కమిటీ నాయకులు వినతిపత్రం అందజేశారు. నాతయ్యపాలెంలోని వాడుక నీటితో పాటు చెరువు నీరు బయటకు పోయేందుకు ఉన్న పెద్దకాలువ ఆక్రమణకు గురవుతుందన్నారు. ఈ ఆక్రమణలకు అడ్డుకట్ట వేయడంతో పాటు నాతయ్యపాలెం చెరువు నుంచి షీలానగర్‌లో ఉన్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం పక్కన ఉన్న అవుట్‌లెట్‌కు అనుసంధానం చేస్తే వరద ముంపు సమస్య పరిష్కారమవుతుందని వివరించారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చినట్టు నాయకులు తెలిపారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో నాయకులు గోపిశెట్టి ఆదినారాయణ, ఎస్.చిన సన్యాసిరావు, జి.రామునాయుడు, జి.వెంకటరమణ, జి.సోమునాయుడు, ఎస్.శ్రీను, బి.అప్పారావు తదితరులు ఉన్నారు.

# చిన్నపాటి తప్పులకే షోకాజ్ నోటీసులు

**» భయం భయంగా**

**విధులు నిర్వర్తిస్తున్న ఉక్కు ఉద్యోగులు**



ఉక్కుటౌన్‌షిప్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): స్టీల్ ప్లాంట్ ఉద్యోగులు ప్రస్తుతం భయం.. భయంగా విధులు నిర్వర్తిస్తున్నారు. ప్లాంటులో ఏ మాత్రం చిన్నపాటి తప్పు జరిగినా ఉద్యోగులకు యాజమాన్యం షోకాజ్ నోటీసులు ఇస్తుంది. గతానికి భిన్నంగా ఉక్కు కర్మాగారంలో పరిస్థితులు నెలకొన్నాయి. ఇటీవల పలువురు ఉద్యోగులకు, కార్మిక నాయకులకు యాజమాన్యం నోటీసులు ఇవ్వడంతో కార్మిక వర్గం ఆందోళన వ్యక్తం చేస్తుంది. వేతనాల కోసం యాజమాన్యాన్ని అడిగేందుకు వెళ్లిన నాయకులకు తాజాగా షోకాజ్ నోటీసులు ఇవ్వడం పట్ల ఉద్యోగులు విచారం వ్యక్తం చేస్తున్నారు. ప్లాంటులో ఇటీవల కాంట్రాక్టు కార్మికులను తొలగించరాదని నిరసనలు, సమ్మెలు చేస్తున్న కార్మిక నాయకులను యాజమాన్యం తొలగించిన విషయం తెలిసిందే. ఈ సమ్మెలో పాల్గొన్న ఉద్యోగ సంఘాల నాయకులకు కూడా షోకాజ్ నోటీసులు ఇచ్చారు. అదేవిధంగా ప్లాంటులో గతంలో మధ్యాహ్న భోజన విరామ సమయంలో సమావేశం నిర్వహించారనే కారణంతో చాలామంది కార్మిక నాయకులకు యాజమాన్యం షోకాజ్ నోటీసులు ఇచ్చిన సంగతి తెలిసిందే. దీంతో కర్మాగారంలో ఎలాంటి సమావేశాన్ని నిర్వహించేందుకు కార్మిక నాయకులు ముందుకు రావడం లేదు. ప్లాంటులో సమావేశాలు, సభలు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామని యాజమాన్యం ఉత్తర్వులు జారీ చేసింది.

అంతేకాకుండా విధి నిర్వహణలో ఏ మాత్రం చిన్నపాటి తప్పు దొర్లినా ఉన్నతాధికారులు కఠినంగా వ్యవహరిస్తున్నారు. ఉద్యోగులకే కాకుండా అధికారులకు కూడా షోకాజ్ నోటీసుల బాధ తప్పడం లేదు. ఇటీవల ఓ కీలక విభాగంలో విధులు నిర్వహించే అధికారులకు నోటీసులు ఇచ్చారు. దీంతో ఆ విభాగంలోని కొంతమంది అధికారులు వీఆర్ఎస్ తీసుకునేందుకు ప్రయత్నించగా, ఇంకొంతమంది రాజీనామా చేసేందుకు సైతం సిద్ధపడ్డారు. ఇలాంటి పరిస్థితులు స్టీల్ ప్లాంటులో ఇప్పుడు నెలకొనడంతో ఉద్యోగులు హడలిపోతున్నారు. నిత్యం ప్లాంట్ పరిపాలన భవనం వద్ద పోలీసులు ఉంటున్నారు. పరిపాలన భవనంలోకి ఏ కార్మిక నాయకుడు వెళ్లినా వెంటనే పోలీసులు కూడా లోపలకు వెళ్తున్నారు.

# ఇరు శాఖల మధ్య వివాదాస్పదంగా ప్రహరీ నిర్మాణం



రైల్వే స్టేషన్ రోడ్డులో ప్రహరీ కోసం చేపట్టిన తవ్వకాలు

పెందుర్తి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): పెందుర్తి రైల్వే స్టేషన్ రహదారిలో చేపట్టిన ప్రహరీ నిర్మాణం ఇరు శాఖల మధ్య వివాదానికి దారితీసింది. ఈ మార్గంలో గల సీహెచ్‌సీ సమీపంలో మండల పరిషత్ స్థలంలో నిర్మాణంలో ఉన్న డిస్ట్రిక్ పంచాయతీ రీసోర్స్ సెంటర్ బిల్డింగ్ (డీపీఆర్‌సీ) భవన నిర్మాణానికి సంబంధించి ప్రహరీ నిర్మాణం చేపట్టారు. ఇందుకోసం గోతులు తీసి కాలమ్స్ వేశారు. అయితే ఈ ప్రహరీ నిర్మాణంపై ఇటీవల మండల పరిషత్ ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్ సిబ్బంది మధ్య వివాదం చోటుచేసుకుంది. ఇది రైల్వే స్టేషన్ 60 అడుగుల రోడ్డు అని, దీనిని ఆక్రమించి ప్రహరీ నిర్మాణం ఎలా చేపడతారని పట్టణ ప్రణాళికా విభాగం అధికారులు అభ్యంతరం తెలిపి పనులు నిలిపివేయడంపై మండల పరిషత్ అధికారులు మండిపడుతున్నారు. మండల పరిషత్‌కు చెందిన స్థలంలో డీపీఆర్‌సీ నిర్మాణం కోసం ప్రహరీ పనులు చేపడితే అభ్యంతరం ఏమిటని మండల పరిషత్ పీఆర్ ఇంజనీరింగ్ సిబ్బంది అంటున్నారు.

రైల్వే స్టేషన్ రోడ్డులో పనులు ఆపారని, మండల పరిషత్ కార్యాలయ సమీపంలో పనులు ఆపే అధికారం ప్లానింగ్ విభాగానికి లేదని వారంటున్నారు. ఇది మాస్టర్ ప్లాన్‌లో 60 అడుగుల రోడ్డు కావడంతో.. ముందుకు వచ్చి ప్రహరీ నిర్మాణం చేపట్టడం వల్ల రహదారి కుదించుకుపోతుందని, తద్వారా వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలుగుతుందని ప్రణాళికా విభాగం సిబ్బంది పేర్కొంటున్నారు. కాగా ఈ రహదారిపై పూర్తి సర్వే జరిపి 60 అడుగుల రోడ్డుకు మార్కింగ్ చేసి ఎక్కడైనా ఆక్రమణలుంటే తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.



హౌసింగ్ బోర్డు కాలనీలోని అల్లూరి సీతారామరాజు పార్కు ప్రవేశ ద్వారం



పార్కులో ఏర్పాటు చేస్తున్న గ్రీనరీ..

# ప్రారంభానికి సిద్ధమవుతున్న అల్లూరి సీతారామరాజు పార్కు

పెదగంట్యాడ, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): పెదగంట్యాడ హౌసింగ్ బోర్డు కాలనీలో నిర్మిస్తున్న అల్లూరి సీతారామరాజు పార్కు ప్రారంభానికి సిద్ధమవుతున్నది. సుమారు రూ.పది కోట్ల వ్యయంతో నిర్మితమవుతున్న ఈ పార్కు పనులు తుది దశకు చేరుకున్నాయి. చిల్డ్రన్ జిమ్, స్కేటింగ్ రింక్, వాకింగ్ ట్రాక్, ఓపెన్ థియేటర్, వాటర్ ఫౌంటెయిన్స్, గ్రీనరీ, తదితర పనులు పూర్తయ్యాయి. గ్రాస్ వేసే పనులు మాత్రమే చివర దశలో ఉన్నాయి. గతంలో ఉన్న సాంకేతిక లోపాలను అధికారులు సవరించారు. అక్టోబరు నెలాఖరులోగా పార్కును ప్రారంభిస్తామని కార్పొరేటర్ గంధం శ్రీనివాసరావు తెలిపారు.



వీల్ చైర్లు పంపిణీ చేసిన అనంతరం దివ్యాంగులతో ఎమ్మెల్యే గణబాబు

## దివ్యాంగులకు వీల్ చైర్ల పంపిణీ

గోపాలపట్నం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (హెచ్‌పీసీఎల్) సౌజన్యంతో డిజేబుల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ పర్యవేక్షణలో మంగళవారం పలువురు దివ్యాంగులకు వీల్ చైర్లను పంపిణీ చేశారు. పశ్చిమ ఎమ్మెల్యే నివాసంలో జరిగిన ఈ కార్యక్రమంలో దివ్యాంగులకు గణబాబు వీల్ చైర్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వరంగ సంస్థల సాయంతో సామాజిక సేవా కార్యక్రమాలను చేపట్టడం వల్ల అర్హులందరికీ మేలు జరుగుతుందన్నారు. కార్పొరేట్ సంస్థలు కూడా సామాజిక బాధ్యతగా సేవా కార్యక్రమాల్లో ముందంజలో ఉండాలని కోరారు. కార్యక్రమంలో హెచ్‌పీసీఎల్ హెచ్‌ఆర్ డీజీఎం కిరణ్, పీఆర్‌వో కాళీ, ఏడీ కె.కవిత, పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా చూడాలి

**ఉపాధ్యాయులకు సూచించిన ఎమ్మెల్యే గణబాబు**

మల్కాపురం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు సూచించారు. శ్రీహరిపురం, మల్కాపురంలో గల జీవీఎంసీ పాఠశాలలను మంగళవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలల్లో ఎటువంటి సమస్యలున్నా తన దృష్టికి తెస్తే వాటి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. పాఠశాలలో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందన్నారు. పలు సమస్యలను విద్యార్థులు, ఉపాధ్యాయులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. విద్యార్థుల సంఖ్య పెరగడంతో తరగతి గదుల కొరత ఉందని, సెప్టిక్ ట్యాంక్ లీక్ అవుతున్నందున తీవ్ర దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నామని వివరించారు. ఆయా సమస్యలను త్వరితగతిన పరిష్కారించాలని ఆయన అధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో టీడీపీ 58వ వార్డు అధ్యక్షుడు కోరాడ శ్రీనివాసరావు, మాజీ కార్పొరేటర్ శీరం ఉమామహేశ్వరి, కూటమి నాయకులు పొత్తబత్తుల శ్రీనివాసరావు, అంగ దుర్గాప్రశాంతి, కాకి పోలిరెడ్డి, వి.రాంబాబు, పొలిమేర శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.




కర్నవానిపాలెంలో నిరుపయోగంగా ఉన్న మరుగుదొడ్లు

## నిరుపయోగంగా సామాజిక మరుగుదొడ్లు

**నిర్వహణ లేకే ఈ దుస్థితికి చేరాయంటున్న ప్రజలు**

గాజువాక, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): గాజువాక నియోజకవర్గ పరిధిలో ప్రతి వార్డులోనూ ఏర్పాటు చేసిన సామాజిక మరుగుదొడ్లు అత్యధిక శాతం నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. ప్రధానంగా మురికివాడలు, పేద వర్గాలు నివసిస్తున్న ప్రాంతాల్లో వీటిని ఎక్కువగా నిర్మించారు. రెండు మూడేళ్ల పాటు సక్రమంగా వినియోగించారు. ఆ తరువాత సెప్టిక్ ట్యాంకులు నిండిపోవడం, నీటి సదుపాయం లేకపోవడం, విద్యుత్ సౌకర్యాలు లేమితో చాలా మరుగుదొడ్లు వినియోగానికి దూరమయ్యాయి. దీంతో ఇవి ప్రస్తుతం నిరుపయోగంగా మారాయి. వీటి నిర్వహణను పట్టించుకోకపోవడం వల్లే ఈ పరిస్థితి వచ్చిందని ఆయా ప్రాంతాల ప్రజలు చెబుతున్నారు. నియోజకవర్గంలో సుమారు వందకు పైగా మరుగుదొడ్లు ఉన్నప్పటికీ 90 శాతానికి పైగా మూతపడ్డాయి. పలు మరుగుదొడ్ల నుంచి భరించరాని దుర్వాసన వస్తుందని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నిరుపయోగంగా ఉన్న మరుగుదోడ్లను వినియోగంలోకి తెచ్చేందుకు తగిన చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

### జీవో నంబర్-296పై ప్రజలకు అవగాహన

వేపగుంట, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): నాయుడుతోట సమీప బంటాకాలనీలో మంగళవారం పెందుర్తి రెవెన్యూ అధికారులు జీవో నంబర్- 296 ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్‌కు సంబంధించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వీఆర్వో మోహన్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గతంలో తమ హయాంలో ఇచ్చిన ఇళ్ల పట్టాలకు రిజిస్ట్రేషన్లు చేస్తుందని, ఇందుకోసం లబ్ధిదారులెవరూ అధిక మొత్తంల నగదు చెల్లించాల్సిన అవసరం లేదన్నారరు. కేవలం 510 రూపాయలు చెల్లిస్తే రిజిస్ట్రేషన్ పక్రియ ముగుస్తుందని వివరించారు. అందువల్ల అర్హులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు, అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.



నిరసన ప్రదర్శనలో పాల్గొన్న నాయకులు, కార్మికులు

## టీటీఐ కూడలిలో ఉక్కు నిర్వాసితుల నిరసన

ఉక్కుటౌన్‌షిప్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): స్టీల్ ప్లాంటులో తొలగించిన కాంట్రాక్టు, నిర్వాసిత కార్మికులను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని చేపట్టిన ఆందోళనలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా మంగళవారం ప్లాంట్ టీటీఐ కూడలిలో నిరసన ప్రదర్శన చేపట్టారు. విధుల నుంచి తొలగించిన కాంట్రాక్టు కార్మికులు, నిర్వాసితులు అధిక సంఖ్యలో చేరుకుని ఉక్కు యాజమాన్యానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ క్రమంలో వారు రోడ్డు పైకి వచ్చి ఉదయం జనరల్ డ్యూటీకి వెళ్తున్న వారిని అడ్డుకునేందుకు యత్నించగా పోలీసులు నిలువరించారు. కార్మికులు పెద్దఎత్తున నినాదాలు చేయడంతో నిర్వాసిత నాయకులను పోలీసులు వాహనంలోకి ఎక్కించి అక్కడ నుంచి తరలించారు. ఈ సందర్భంగా పలువురు కార్మిక నాయకులు మాట్లాడుతూ ప్లాంట్ యాజమాన్యం నిర్వాసితుల పట్ల తీవ్ర నిర్లక్ష్యాన్ని కనబరుస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. తొలగించిన వారిని తిరిగి విధుల్లోకి తీసుకునేంత వరకు తాము పోరాటాలను కొనసాగిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు పితాని భాస్కరరావు, కె.వంశీకృష్ణ, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

### మాజీ ఎమ్మెల్యే పోతిన సన్యాసిరావుకు నివాళి



పెదగంట్యాడలో సన్యాసిరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

పెదగంట్యాడ, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): కమ్యూనిస్టు నేత, మాజీ ఎమ్మెల్యే పోతిన సన్యాసిరావు సేవలు మరువలేనివని సీపీఐ గాజువాక నియోజకవర్గ నాయకులు కొనియాడారు. ఇక్కడి సీపీఐ కార్యాలయంలో మంగళవారం సన్యాసిరావు వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. పోతిన సన్యాసిరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు జి.ఆనంద్, పెదపూడి దుర్గారావు, పల్లేటి పోలయ్య, కె.పోతయ్య, వై.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

**మల్కాపురం:** మాజీ ఎమ్మెల్యే దివంగత పోతిన సన్యాసిరావు వర్ధంతిని మల్కాపురం గ్రామ మండలిలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే రెహమాన్ ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం రెహమాన్ మాట్లాడుతూ పోతిన సన్యాసిరావు ఎమ్మెల్యేగా ప్రజా సంక్షేమం కోసం ఎన్నో కార్యక్రమాలను చేపట్టారన్నారు. కేంద్ర ప్రభుత్వం స్టీల్ ప్లాంటును ప్రైవేటుపరం చేయాలని యోచిస్తుండడం దారుణమన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాసరావు, గుడాల రాంబాబు, వై.కనకరాజు, రామకృష్ణ, కామేశ్వరరావు, త్రినాథ్, గుడాల జయ, గండి రమణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

### కాలుష్య కారక నిర్మాణాలను అడ్డుకుంటాం

**68వ వార్డు అఖిలపక్ష కమిటీ నాయకులు**



సమావేశంలో పాల్గొన్న నాయకులు

అక్కిరెడ్డిపాలెం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): తమ వార్డుకు ఆనుకుని ఉన్న పోర్టుకు చెందిన స్థలంలో ఎటువంటి కాలుష్య కారక నిర్మాణాలను చేపట్టినా ఐక్యంగా ఉద్యమించి అడ్డుకుంటామని 68వ వార్డు అఖిలపక్ష కమిటీ నాయకులు స్పష్టం చేశారు. పంచవటి వుడా కాలనీలో మంగళవారం సమావేశమైన వార్డు అఖిల పక్ష కమిటీ నాయకులు అక్కిరెడ్డిపాలెం, మింది కాలనీలకు ఆనుకుని ఉన్న పోర్టు స్థలంలో బీపీసీఎల్‌కు చెందిన గొడౌన్ నిర్మాణ పనులు చేపడుతుండడం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. ఇక్కడ 250 మీటర్ల వరకు గ్రీనరీని ఏర్పాటు చేయడంతో పాటు కాలుష్యం వెదజల్లే ఎటువంటి నిర్మాణాలకు అధికారులు అనుమతి ఇవ్వరాదని కోరారు. దీనిపై ఎంపీ శ్రీభరత్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్‌తో పాటు ఉన్నతాధికారులను కలిసి సమస్యను వివరించాక భవిష్యత్తు కార్యాచరణ చేసేందుకు తీర్మానించారు. సమావేశంలో నాయకులు ప్రగడ చిన్నారావు, సంద్రాన నూకరాజు, సర్వసిద్ధి అనంతలక్ష్మి, మురళీకృష్ణ, బి.శిరీష, యువశ్రీ, మానస, తదితరులు పాల్గొన్నారు.

### ఉక్కు డైరెక్టర్ (పర్సనల్)గా రాకేశ్ నందన్ సహాయ్

ఉక్కుటౌన్‌షిప్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): స్టీల్ ప్లాంట్ డైరెక్టర్ (పర్సనల్)గా ఎన్టీపీసీ లిమిటెడ్ సంస్థకు చెందిన అడిషనల్ జనరల్ మేనేజర్ (హెచ్‌ఆర్) రాకేశ్ నందన్ సహాయ్ పేరును పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ సెలక్షన్ బోర్డు (పీఈఎస్‌బీ) సిఫార్సు చేసింది. ఢిల్లీలో మంగళవారం జరిగిన ఇంటర్వ్యూకు విశాఖ స్టీల్ ప్లాంట్ నుంచి నలుగురు అధికారులు, బీఎస్ఎన్ఎల్ నుంచి ఇద్దరు, ఎన్టీపీసీ నుంచి ఇద్దరు, ఇంజనీర్స్ లిమిటెడ్ నుంచి ఒకరు, ఓఎన్‌జీసీ నుంచి ఒకరు... ఇలా మొత్తం పదిమంది అధికారులు హాజరయ్యారు. ఎన్టీపీసీ సంస్థకు చెందిన అడిషనల్ జనరల్ మేనేజర్ రాకేశ్ నందన్ సహాయ్ పేరును కమిటీ సిఫార్సు చేసింది. ప్రస్తుతం ప్లాంటులో డైరెక్టర్ (పర్సనల్)గా విధులు నిర్వహిస్తున్న ఎస్‌సీ పాండే ఈ నెలాఖరున పదవీ విరమణ చేయనున్నందున ఆయన స్థానంలో రాకేశ్ నందన్ రానున్నారు.

### మాతా మహిళా సంక్షేమ సంఘం వార్షికోత్సవం

పెందుర్తి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మహిళలు ఆర్థిక సాధికారత సాధించడమే లక్ష్యంగా సంఘం ముందుకు సాగుతుందని మాతా మహిళా సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షురాలు వానా సరస్వతి అన్నారు. ఇక్కడి సంఘ కార్యాలయంలో సోమవారం రాత్రి మాతా మహిళా సంక్షేమ సంఘం 26వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా సరస్వతి కేక్ కట్ చేసి సభ్యులకు పంచిపెట్టారు. అనంతరం ఆమె మాట్లాడుతూ సంఘం ఆధ్వర్యంలో జ్యూట్ బ్యాగుల తయారీ కేంద్రాన్ని నెలకొల్పి పలువురు మహిళలకు ప్రత్యక్ష, పరోక్షంగా ఉపాధి కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు ఉమ, అరుణ, ఈశ్వరమ్మ, అశ్విని, దివ్య, తదితరులు పాల్గొన్నారు.

### శిథిలావస్థకు చేరిన వాటర్ ట్యాంకులు

**భయాందోళన చెందుతున్న ప్రజలు**



యాతపాలెంలోని వాటర్ ట్యాంక్

కూర్మన్నపాలెం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 86వ వార్డు పరిధి రాజీవ్ నగర్, యాతపాలెంలలో వాటర్ ట్యాంకులు శిథిలావస్థకు చేరుకున్నాయి. దీంతో ఇవి ఎప్పుడు కూలిపోయి ఎవరిపై పడతాయోనని స్థానికులు భయాందోళన చెందుతున్నారు. ఈ ట్యాంకుల పైకి ఎక్కేందుకు, దిగేందుకు అవకాశం లేకపోవడంతో ఎన్నో ఏళ్లుగా వీటిని శుభ్రపరచలేదు. అందువల్ల తాగునీటిలో చెత్తాచెదారం, నలకలు, బురద నీరు వస్తుందని వుడానగర్, రాజీవ్‌నగర్, యాతపాలెం ప్రాంత ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కలుషితమైన నీటిని తాగితే రోగాల బారినపడే ప్రమాదం ఉందని వారు వాపోతున్నారు. అందువల్ల అధికారులు స్పందించి శిథిలావస్థకు చేరుకున్న వాటర్ ట్యాంకులను తొలగించి వాటి స్థానంలో కొత్తవి నిర్మించవలసిందిగా ప్రజలు కోరుతున్నారు.

# క్రీడా కుసుమం


కరుణను సత్కరిస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర

సాగర్‌నగర్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఆమె అంధురాలు. ఆటల్లో ఆరితేరింది. మొక్కవోని దీక్షతో కృషి చేసి, తనలోని ప్రతిభను ప్రదర్శించింది. ఫలితంగా భారత అంధుల టి-20 క్రికెట్ జట్టుకు ఎంపికయింది. శిక్షణ తీసుకున్న ఆరునెలల్లోనే ప్రతిభ ప్రదర్శించి, ప్రపంచ క్రికెట్‌లో ఆడే భారత జట్టుకు ఎంపికవడంతో అంధ బాలికల ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులతో పాటు జడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర అభినందించారు. అల్లూరి జిల్లా పాడేరు మండలం వంట్లమామిడికి చెందిన పాంగి కరుణకుమారి అక్కడే ఐదో తరగతి వరకు చదువుకుంది. ఆ సమయంలోనే ఆమెకు దృష్టి సమస్య ఎదురయింది. పాడేరులో ఆరో తరగతిలో చేరినా, చూపు మందగించడంతో ఇంటికే పరిమితమయింది. ఆ తరువాత కాస్త కనిపిస్తుండడంతో పాడేరు బాలసదన్‌లో 6,7 తరగతులు పూర్తిచేసింది.

ఈ క్రమంలో ఆమెను తల్లిదండ్రులు బీచ్‌రోడ్డు సాగర్‌నగర్‌లో ఉన్న అంధ బాలికల ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలలో చేర్పించారు. ప్రస్తుతం పదో తరగతి చదువుతోంది. ఆటపాటల్లో ప్రతిభ కనబరుస్తుండడంతో ఉపాధ్యాయులు ప్రోత్సహించారు. క్రికెట్‌లో శిక్షణ ఇచ్చారు. హైదరాబాద్, బెంగళూరు, కర్ణాటక జట్లతో జరిగిన లీగ్‌మ్యాచ్‌లలో ఉత్తమ ప్రదర్శన కనబరిచింది. పాంగి కరుణను జడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర అభినందించి సత్కరించారు. ఆమె ఆర్థిక పరిస్థితిపై ఆరా తీసి, క్రీడా పరికరాల కొనుగోలుకు సహకరిస్తానన్నారు. కరుణకు ఇల్లు మంజూరు చేసేలా కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు డి.విజయ మాట్లాడుతూ కరుణ క్రికెట్‌తో పా టు వివిధ క్రీడాంశాల్లో ప్రతిభ చూపుతోందన్నారు. ఆరు నెలల శిక్షణలో రాటుదేలి టి-20 ప్రపంచ కప్‌కు ఎంపికయ్యిందన్నారు. తనను అన్ని విధాలుగా ప్రోత్సహించిన ఉపాధ్యాయులకు కరుణ ధన్యవాదాలు తెలిపింది. ఈ కార్యక్రమంలో పీఈటీ రవి, సిబ్బంది పాల్గొన్నారు.

# వీఎంఆర్‌డీఏ నర్సరీలో కోటి అందాలు

విశాఖపట్నం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): విశాఖ మహా నగర ప్రాంత అభివృద్ధి సంస్థ (వీఎంఆర్‌డీఏ) ఎంవీపీ కాలనీలోని నర్సరీని రూ.కోటి వ్యయంతో ఆకర్షణీయంగా తీర్చిదిద్దింది. ప్రవేశ ద్వారం, అంతర్గత రహదారులు, మొక్కల ప్రదర్శన, అమ్మకానికి సంబంధించి ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. ఆవరణలోని భారీ మర్రిచెట్టు పరిసరాలకు ఆకట్టుకునేలా మార్చారు. సందర్శకులు అక్కడ సేదదీరే సదుపాయం కల్పించింది. చుట్టూ వివిధ మొక్కలను ప్రదర్శనకు ఉంచింది. సిబ్బందికి ఆఫీసు గది, స్టోర్ రూమ్, టాయిలెట్లు ఏర్పాటు చేసింది. ప్రహరీపైన కంచె, నర్సరీ మొత్తం విద్యుద్దీపాలతో శోభాయమానంగా తీర్చిదిద్దారు. ప్రధాన రహదారికి ఇరువైపులా స్తంభాలు ఏర్పాటుచేసి, వాటికి అలంకరణ మొక్కలు అల్లించడంతో సందర్శకులను ఆకట్టుకుంటోంది.


నర్సరీలోని కార్యాలయం


ప్రదర్శన గది

ఇక్కడ సీజనల్ మొక్కలను అతి తక్కువ ధరకే విక్రయిస్తారని అధికార వర్గాలు తెలిపాయి.


అందుబాటులో ఉంచిన మొక్కలు


అందంగా ఏర్పాటు చేసిన షెల్టర్




# వృద్ధుడి దారుణ హత్య

- రాయితో తలపై మోదిన యువకుడు
- వద్దన్నా పశువులను మేతకు తీసుకువెళ్లడమే కారణం?
- ఎల్లపువానిపాలెం గ్రామంలో దారుణం


మృతదేహం వద్ద ఆధారాలు సేకరిస్తున్న పోలీసులు, పరదేశినాయుడు (ఫైల్)

గోపాలపట్నం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): తాను వద్దన్న వైపు పశువులను మేతకు తీసుకువెళ్లాడనే కోపంతో ఓ యువకుడు వృద్ధుడి తలపై రాయితో మోది కిరాతకంగా హత్యచేశాడు. ఈ దారుణం గ్రేటర్ 89వ వార్డు ఎల్లపువానిపాలెం గ్రామంలో మంగళవారం ఉదయం జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.

ఎల్లపునిపాలెం గ్రామానికి చెందిన భీశెట్టి పరదేశినాయుడు (78) పాల వ్యాపారం చేస్తుంటాడు. అతడి వద్ద కొన్ని పాడె గేదెలు ఉన్నాయి. వాటిని రోజూ గ్రామానికి సమీపంలోని పొలాల్లోకి మేతకు తీసుకువెళ్తుంటాడు. అదే క్రమంలో మంగళవారం ఉదయం 10 గంటల సమయంలో గెదెలను తోలుకొని గ్రామ శివారుకు వెళ్లాడు. కొద్దిసేపటి తరువాత సమీపంలోని రైల్వే కేబిన్‌కు వెళ్లే దారివైపు పశువులను తరలించాడు. అదే మార్గంలో గ్రామంలోని ఎస్సీ కాలనీకి చెందిన అలమండ నితీశ్‌కుమార్ (23) తన పశువులను మేపుతున్నాడు. అటువైపు గేదెలను తీసుకురావద్దని వారించాడు. అతడి మాట పట్టించుకోకపోవడంతో పరదేశినాయుడుతో వాగ్వాదానికి దిగాడు. అంతేకాకుండా కోపంతో ఒక్కసారిగా దాడికి దిగాడు. సమీపంలో ఉన్న కొందరు కేకలు వేస్తున్నా పట్టించుకోకుండా వృద్ధుడిని నేలపైకి నెట్టి, సమీపంలో ఉన్న రాయితో తలపై మోది కిరాతకంగా హత్య చేశాడు. అక్కడివారు వెంటనే పోలీసులకు సమాచారం అందించడంతో సంఘటనా స్థలానికి చేరుకున్న గోపాలపట్నం సీఐ లెంక సన్యాశినాయుడు, సిబ్బంది మృతదేహాన్ని పరిశీలించారు. క్లూస్ టీమ్, ఫోరెన్సిక్ బృందాలను రప్పించి ఆధారాలు సేకరించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పరదేశినాయుడు హత్య విషయం తెలియడంతో అతడి బంధువులు, గ్రామస్థులు పెద్దసంఖ్యలో సంఘటనా స్థలానికి చేరుకున్నారు. పరదేశినాయుడు భార్య శివాలక్ష్మి, కుమారుడు ఈశ్వరరావు, కుమార్తెలు కన్నీరుమున్నీరుగా విలపించారు. కాగా వృద్ధుడిని హత్య చేసిన యువకుడిని పోలీసులు అదుపులోకి తీసుకుని, స్టేషన్‌కు తరలించి విచారిస్తున్నట్టు సమాచారం.

## యువకుడిపై రౌడీషీటర్ల దాడి

- 9 మందిని అరెస్టు చేసిన పోలీసులు

భీమునిపట్నం (రూరల్) సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఓ యువకుడిపై ఇద్దరు రౌడీ షీటర్లతో సహా మరో ఏడుగురు దాడి చేశారు. ఈ సంఘటన భీమిలి మండలం చిట్టివలసలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... తాటితూరు గ్రామానికి చెందిన రౌడీ షీటర్ పతివాడ వినోద్ కుమార్ (కిట్టు) అనుచరులతో కలిసి సోమవారం రాత్రి చిట్టివలసలోని ఓ హోటల్‌కు వెళ్లాడు. అక్కడ పుట్టిన రోజు వేడుకలు చేసుకుంటున్న గొల్ల పవన్‌కుమార్‌తో మాటామాటా పెరిగి దాడి చేశాడు. అంతేకాకుండా తన బైక్‌పై ఎక్కించుకుని తీసుకువెళ్లి తీవ్రంగా గాయపరిచాడు. మజ్జివలస వద్ద నిర్మానుష్య ప్రాంతంలో వదిలిపెట్టాడు. సమాచారం మేరకు పోలీసులు అక్కడికి చేరుకుని క్షతగాత్రుడ్ని ఆస్పత్రికి తరలించారు. ఈ కేసులో మంగళవారం రౌడీ షీటర్లు పతివాడ వినోద్‌కుమార్, పల్లా వెంకట పవన్‌కుమార్‌తో పాటు సోమశేఖర్, బి.నాని, బోని సన్యాసిరావు, బి.రాజు, నాగరాజు, రాము, సత్యలను అరెస్టు చేశామన్నారు.


చికిత్స పొందుతున్న పవన్‌కుమార్

## నేడు విమానాశ్రయంలో యాత్రి సేవా దివస్


సమావేశంలో మాట్లాడుతున్న విమానాశ్రయం డైరెక్టర్ పురుషోత్తమ్

గోపాలపట్నం, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో విశాఖపట్నం విమానాశ్రయంలో బుధవారం యాత్రి సేవా దివస్ నిర్వహించనున్నట్లు విమానాశ్రయ డైరెక్టర్ ఎస్.పురుషోత్తమ్ తెలిపారు. విమానాశ్రయంలో మంగళవారం ఏర్పా టు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ డొమస్టిక్ ఎరైవల్ ప్రాంతంలో బుధవారం ఉదయం 8 గంటలకు విద్యార్థులకు క్విజ్, చిత్రలేఖనం పోటీలు నిర్వహిస్తామన్నారు. ఆగమన, నిష్క్రమణ ప్రాంతాల్లో ప్రజా నృత్య ప్రదర్శన, ఏక్ పేడ్ మాకే నామ్, రక్తదాన శిబిరం, ఉచిత నేత్ర వైద్య శిబిరాలు ఏర్పాటు చేశామన్నారు. ప్రయాణికుల కోసం సెల్ఫీ/ఫొటో బూత్‌లు, ఫీడ్‌బ్యాక్ ఇంటరాక్టివ్ సెషన్లు నిర్వహిస్తామన్నారు.

## తొమ్మిది మంది ఏవోలకు ఎంపీడీవోలుగా పదోన్నతి


పదోన్నతి లభించిన అధికారులతో జడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర తదితరులు

విశాఖపట్నం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి విశాఖ జిల్లాలో జడ్పీ కార్యాలయం, ఎంపీడీవో కార్యాలయాల్లో పాలనాధికారులు, విస్తరణాధికారులుగా పనిచేస్తున్న తొమ్మిదిమందికి మండల పరిషత్ అభివృద్ధి అధికారులు (ఎంపీడీవో)గా పదోన్నతి కల్పించారు. ఈ మేరకు వారికి జడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర మంగళవారం నియామక ఉత్తర్వులను అందజేశారు. పదోన్నతి లభించిన అధికారుల్లో బీహెచ్‌వీ. రమణబాబుకు జీకేవీధి, కేఎస్‌పీ నారాయణరావుకు బుచ్చెయ్యపేట, ఓ.మహేశ్‌కు రావికమతం, సీహెచ్ చంద్రశేఖరరావుకు కశింకోట, ఎంఎస్. శ్రీనివాసులుకు నాతవరం, మీనాకుమారికి ఎస్.రాయవరం, చంద్రశేఖరరావుకు కోటవురట్ల, విజయలక్ష్మికి పాయకరావుపేట, కె.ధర్మారావుకు ముంచంగిపుట్టులో పోస్టింగ్స్ ఇచ్చారు. జడ్పీ సీఈవో పి.నారాయణమూర్తి, డిప్యూటీ సీఈవో కె. రాజ్‌కుమార్ అభినందించారు.

## ముఖ్యమంత్రికి పారా క్రీడాకారుల ధన్యవాదాలు


ఏయూ గేటు వద్ద కేక్ కట్ చేస్తున్న పారా క్రీడాకారులు

విశాఖపట్నం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ నిర్వహించడం ద్వారా క్రీడా కోటాలో ఉద్యోగావకాశాలు కల్పించడంపై పారా క్రీడాకారులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు సీఎం చంద్ర బాబునాయుడుకు కృతజ్ఞతలు తెలియజేస్తూ ఏయూ ప్రధాన గేటు వద్ద కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. థ్యాంక్యూ సీఎం సర్ అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో శాప్ డైరెక్టర్ రాజు, టీడీపీ నేత ఆరేటి మహేష్, రామస్వామి, ఆవాల రమేష్, డాక్టర్ శీతల మదన్ తదితరులు పాల్గొన్నారు.

## పలు రైళ్లు రద్దు...దారి మళ్లింపు

విశాఖపట్నం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): చక్రధర్‌పూర్ డివిజన్‌లో నిర్మాణ పనులు చేపట్టనున్న నేపథ్యంలో అక్టోబరు 14, 21, 28, నవంబరు 4, 11, 18, 25, డిసెంబరు 2, 9, 16న రూర్కెలా జంక్షన్-జగదల్‌పూర్ ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్‌ను (18107) రద్దుచేయగా తిరుగు ప్రయాణంలో అక్టోబరు 15, 22, 29, నవంబరు 5, 12, 19, 26, డిసెంబరు 3,10,17న రద్దు చేశామన్నారు.

### బెంగళూరు, కామాఖ్య మళ్లింపు

ఈస్ట్రన్ రైల్వే దుర్గాపూర్‌లో నాన్ ఇంటర్ లాకింగ్ పనులు పనులు చేపట్టనున్న నేపథ్యంలో బెంగళూరు-కామాఖ్య ఏసీ ఎక్స్‌ప్రెస్ (12251) నవంబరు 1, 8, 15, 22న వయా అసన్సోల్, అండల్, సైంథియా మీదుగా నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో నవంబరు 5, 12, 19న వయా సైంథియా, అండల్, అసన్సోల్ మీదుగా నడుస్తుంది. ఈ సర్వీసులకు దుర్గాపూర్‌లో హాల్ట్‌ను తొలగించారు.

## ప్రత్యేక రైళ్లకు అదనపు కోచ్‌లు

విశాఖపట్నం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): పండగల రద్దీని దృష్టిలో ఉంచుకుని విశాఖ, తిరుపతి, చర్లపల్లి, బెంగళూరు మధ్య నడిచే ప్రత్యేక వారాంతపు రైళ్లతోపాటు సంబల్‌పూర్-ఇరోడ్ మధ్య నడిచే ప్రత్యేక రైళ్లకు తాత్కాలిక అదనపు కోచ్‌లు జతచేస్తున్నామని సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. విశాఖ-తిరుపతి మధ్య నడిచే 08547, 08548 నంబర్లు గల ప్రత్యేక రైళ్లకు అక్టోబరు ఒకటి నుంచి నవంబరు 27 వరకు (నామినేటెడ్ తేదీల్లో) ఒక థర్డ్ ఏసీ ఎకానమీ కోచ్; విశాఖ-చర్లపల్లి రాకపోకలు సాగించే 08579, 08580 నంబర్లు గల ప్రత్యేక రైళ్లకు అక్టోబరు 3 నుంచి నవంబరు 29 వరకు (నామినేటెడ్ తేదీల్లో) ఒక థర్డ్ ఏసీ ఎకానమీ కోచ్; విశాఖ-బెంగళూరు మధ్య నడిచే 08581, 08582 నంబర్లు గల ప్రత్యేక రైళ్లకు అక్టోబరు 21 నుంచి డిసెంబరు ఒకటి వరకు (నామినేటెడ్ తేదీల్లో) ఒక థర్డ్ ఏసీ ఎకానమీ కోచ్; సంబల్‌పూర్-ఇరోడ్ మధ్య రాకపోకలు సాగిస్తున్న 08311, 08312 నంబర్లు గల ప్రత్యేక రైళ్లకు ఈనెల 17 నుంచి నవంబరు 28 వరకు (నామినేటెడ్ తేదీల్లో) ఒక స్లీపర్ క్లాసు కోచ్ అందుబాటులో ఉంటాయన్నారు.

# సింహగిరిపై సందడిగా ఉట్టి సంబరం


కృష్ణాలంకారంలో గోవిందరాజస్వామి, ఉట్టిని కొడుతున్న భక్తుడు

సింహాచలం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): భక్తుల ఆనందోత్సాహాల నడుమ మంగళవారం సాయంత్రం సింహగిరిపై ఉట్టి సంబరం నిర్వహించారు. స్వామి వారికి మధ్యాహ్న పవళింపు సేవ తరువాత ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని శిరస్సున నెమలి పింఛం, చేతిలో మురళి, ఒక చేత్తో ఉట్టిలో ఉన్న వెన్న కోసం నిచ్చెన ఎక్కుతున్న రీతిలో అలంకరించి పల్లకిలో ఉంచారు. మంగళవాయిద్యాల నడుమ బేడా మండపంలో తిరువీధి జరిపి ప్రధాన రాజగోపురం వద్దకు తీసుకువచ్చారు. అక్కడ పల్లకిలో స్వామిని ఉంచి ఎదురుగా ఉట్టెను కట్టారు. ఆచారం ప్రకారం నమ్మి కుటుంబానికి చెందిన అప్పలరాజును ఉట్టిని కొట్టేందుకు అనుమతిచ్చారు. ప్రధానార్చకులు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, కరి సీతారామాచార్యులు ఉట్టెను లాగుతుండగా, భక్తులు నీటిని చల్లుతుండగా మూడుసార్లు ఉట్టి సంబరం నిర్వహించారు. అనంతరం నవనీతాన్ని స్వామికి నివేదించి, భక్తులకు పంపిణీ చేశారు. మంగళవాయిద్యాలు, కోలాటాల నడుమ తిరువీధి నిర్వహించారు. ఏఈవో కె.తిరుమలేశ్వరరావు, పర్యవేక్షణాధికారి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

# ప్రజాస్వామ్య పరిరక్షణకు ప్రతి ఒక్కరు కృషిచేయాలి

**ప్రొఫెసర్ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్**



సమావేశంలో మాట్లాడుతున్న యార్లగడ్డ లక్ష్మీప్రసాద్

విశాఖపట్నం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): దేశంలో ప్రజాస్వామ్య పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని విశ్వ హిందీ పరిషత్ అధ్యక్షుడు, పద్మభూషణ్ ప్రొఫెసర్ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ పేర్కొన్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం పొలిటికల్ సైన్స్ అండ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగం, ఇనిస్టిట్యూట్ ఫర్ డెమొక్రటిక్ ఎంగేజ్‌మెంట్ అండ్ అకౌంట్‌బులిటీ ఫౌండేషన్ (ఇండియా) ఆధ్వర్యంలో మంగళవారం అంతర్జాతీయ ప్రజాస్వామ్య దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన యార్లగడ్డ మాట్లాడుతూ భారత్‌లో ప్రజాస్వామ్యం స్థిరంగా ఉండడానికి ఓటర్లే కారణమన్నారు. కుల సమీకరణలు, ప్రజాస్వామిక దుర్ఘటనలు ఎదురైనా ప్రజాస్వామ్య పరిరక్షణకు కృషిచేశారన్నారు. గౌరవ అతిథి ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎ.నరసింహారావు మాట్లాడుతూ ప్రజాస్వామ్యం పరిడ విల్లేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. ప్రపంచంలో భారత్ మహోన్నత దేశంగా మారడానికి కారణం రాజ్యాంగమేనన్నారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ ఈఏ నారాయణ, పొలిటిక్స్ విభాగాధిపతి పేటేటి ప్రేమానందం, పైడి రమేష్‌నాయుడు, ఐడియా చైర్మన్ డాక్టర్ తాడి నాగ రాజు, విభాగ సహ ఆచార్యులు డాక్టర్ కె.సత్యనా రాయణ, డాక్టర్ హరీష్, డాక్టర్ రతన్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

## అమరావతికి కొత్త టీచర్ల ప్రయాణం

- జిల్లా నుంచి 75 బస్సుల ఏర్పాటు
- విశాఖ విమల విద్యాలయం వద్దే రిజిస్ట్రేషన్

విశాఖపట్నం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ ద్వారా ఎంపికైన ఉపాధ్యాయ అభ్యర్థులను అమరావతికి తీసుకెళ్లడానికి జిల్లా విద్యాశాఖ సన్నాహాలు చేపట్టింది. ఉక్కునగరంలోని విశాఖ విమల విద్యాలయం నుంచి ఈ నెల 18వ తేదీ ఉదయం బస్సులు బయలుదేరేలా ఏర్పాట్లుచేశారు. ఉమ్మడి జిల్లా, జోన్-1లో ఎంపికైన అభ్యర్థులు, కుటుంబ సభ్యులు మొత్తం మూడువేల మందికి 75 ఆర్టీసీ బస్సులు సిద్ధంచేశారు. ఎంపికైన అభ్యర్థులకు ఫోన్‌చేసి 18వ తేదీ ఉదయం 7.30 గంటలకు విశాఖ విమల విద్యాలయానికి చేరుకోవాలని సూచించారు. వారికి తోడుగా వచ్చే వారి వివరాలు తెలుసుకున్నారు. ఉదయం 10 గంటలకు బయలుదేరే ముందు విశాఖ విమల విద్యాలయం వద్ద అల్పాహారం అందిస్తారు. మధ్యాహ్నానికి నక్కపల్లికి చేరుకుని అక్కడ భోజనం అందిస్తారు. ఆ రాత్రికి విజయవాడ చేరుకుని అక్కడ ఎంపికచేసిన చోట్ల వసతి కల్పిస్తారు. 19న అమరావతిలో వేదిక వద్దకు తీసుకెళతారు. జిల్లాల వారీగా ఏర్పాటుచేసే కౌంటర్ల వద్ద నియామక పత్రాలు అందజేస్తారు. తిరిగి అదే రోజు రాత్రి భోజనం తరువాత విశాఖకు తీసుకువస్తారు. ప్రతి ఐదు బస్సులకు వైద్యుడు, సిబ్బందితో కూడిన బృందాన్ని నియమించారు. నియోజకవర్గాల వారీగా బస్సులు కేటాయిస్తామని పాఠశాల విద్యాశాఖ ఆర్జేడీ విజయభాస్కర్ తెలిపారు. ఎటువంటి అసౌకర్యానికి గురికాకుండా పలు కమిటీలు వేసి, బాధ్యతలు అప్పగించామన్నారు.

## నిరుద్యోగులకు ఉచిత శిక్షణ, ఉపాధి

విశాఖపట్నం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): స్కిల్ డెవలప్‌మెంట్ ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో నిరుద్యోగులకు నైపుణ్య కోర్సుల్లో శిక్షణ, ఉపాధి కల్పించనున్నారు. ఇంటర్, ఐటీఐ, డిప్లమో, బీటెక్ పూర్తిచేసిన 18 నుంచి 28 ఏళ్లలోపు వయసున్న వారుఅర్హులన్నారు. ద్వారకానగర్ ఆర్టీసీ కాంప్లెక్స్‌వద్ద గల ఇనిస్టిట్యూట్‌లో మూడు నెలలపాటు ఫార్మా, ఫైర్ అండ్ సేఫ్టీ, ఆఫీస్ అసిస్టెంట్, రిటైల్ అండ్‌సేల్స్, ఎలక్ట్రికల్, సోలార్ పీవీ ఇన్‌స్టాలేషన్ వంటి నైపుణ్య కోర్సుల్లో శిక్షణ ఉంటుందన్నారు. వివరాలకు 79893 13189, 70755 68963 నంబర్లలో సంప్రదించాలన్నారు.

## అధ్యయన యాత్రకు పయనమైన కార్పొరేటర్లు


విమానంలో మేయర్ పీలా శ్రీనివాసరావు, జీవీఎంసీ కార్పొరేటర్లు

విశాఖపట్నం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఉత్తర భారతదేశంలోని పలు మునిసిపల్ కార్పొరేషన్లలో అధ్యయనం కోసం జీవీఎంసీ మేయర్ పీలా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కార్పొరేటర్లు మంగళవారం రాజస్థాన్ బయలుదేరివెళ్లారు. దేశంలోని వివిధ కార్పొరేషన్లలో అమలుచేస్తున్న మెరుగైన ప్రాజెక్టులు, అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించి, వాటిలో నగరానికి అనువైన వాటిని గుర్తించి తిరిగి వచ్చిన తరువాత నగరంలో అమలుచేసేందుకు వీలుగా జీవీఎంసీ కార్పొరేటర్లు ప్రతి ఏటా అధ్యయన యాత్రకు వెళుతున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా ఈ ఏడాది జైపూర్, జోద్‌పూర్, ఢిల్లీ మునిసిపల్ కార్పొరేషన్లను సందర్శించేందుకు వీలుగా పదిరోజుల పర్యటనకు రూపకల్పన చేశారు. కాగా కార్పొరేటర్లలో పీతల మూర్తియాదవ్, బి.గంగారావు, బెహరా స్వర్ణలత, కుంచె జ్యోత్స్న, గాడు చిన్నికుమారి, అక్కరమాని రోహిణి తదితరులు అధ్యయనయాత్రకు గైర్హాజరవడంతో మంగళవారం 82 మంది కార్పొరేటర్లు విశాఖ నుంచి విమానంలో రాజస్థాన్ బయలుదేరి వెళ్లారు. వీరిలో 43 మంది మహిళా కార్పొరేటర్లు కాగా 39 మంది పురుష కార్పొరేటర్లు ఉన్నారు. కార్పొరేటర్లతోపాటు జీవీఎంసీ కార్యదర్శి బీవీ రమణ, వైద్యాధికారి సాయికళ్యాణ్, రెవెన్యూ అధికారి టి.నాగేంద్రకుమార్, అకౌంట్స్ అధికారి వి.నారాయణరావు తదితరులు అధ్యయనయాత్రకు వెళ్లారు.

## పోర్టును సందర్శించిన నెదర్లాండ్స్ బృందం



నెదర్లాండ్స్ బృందానికి జ్ఞాపిక బహూకరిస్తున్న పోర్టు డిప్యూటీ చైర్మన్ దుర్గేశ్ కుమార్ దూబే. పక్కన సెక్రటరీ వేణుగోపాల్ తదితరులు

విశాఖపట్నం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం పోర్టును మంగళవారం నెదర్లాండ్స్ ఎంబసీ బృందం సందర్శించింది. భారత్‌లోని నెదర్లాండ్స్ రాయబారి మారిసా గెరార్డ్స్ సారథ్యంలో వీరు ఇక్కడికి రాగా పోర్టు డిప్యూటీ చైర్మన్ దుర్గేశ్‌కుమార్ దూబే, కార్యదర్శి వేణుగోపాల్ స్వాగతం పలికారు. పోర్టులో మౌలిక సదుపాయాలు, సరకు నిర్వహణ సామర్థ్యం, ఆధునికీకరణ, మెకనైజేషన్, కవర్డ్ స్టోరేజీ సదుపాయం, సోలార్ విద్యుత్ వినియోగం, ఇంటర్నేషనల్ క్రూయిజ్ సౌకర్యం వంటి అంశాలు వివరించారు. పోర్టులో పెట్టుబడి అవకాశాలు, ఎగుమతి, దిగుమతి కార్యక్రమాలను విస్తృతం చేసే అంశాలపై చర్చించారు. పోర్టు కంటెయినర్ టెర్మినల్ ప్రపంచంలో 19వ స్థానంలో ఉందని పేర్కొన్నారు. పోర్టులో హరిత, పరిశుభ్రత కార్యక్రమాల అమలు తీరును నెదర్లాండ్స్ రాయబారి మారిసా గెరార్డ్స్ అభినందించారు.

## ముఖ్యమంత్రి పర్యటనకు పక్కాగా ఏర్పాట్లు : జేసీ

విశాఖపట్నం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు బుధవారం నగరంలో జరిపే పర్యట నను సమన్వయంతో విజయవంతం చేయాలని అధికారులను జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ ఆదేశించారు. మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఏర్పాట్లపై సమీక్షించారు. ముఖ్యమంత్రి ముందుగా విమానాశ్రయానికి చేరుకుంటారని, అక్కడి నుంచి ఏయూ సాగరిక హాల్‌లో జరిగే హెల్త్ స్క్రీనింగ్ పరీక్షల తీరును, ఏర్పాటుచేసిన స్టాళ్లను పరిశీలిస్తారన్నారు. అనంతరం సభలో ప్రసంగిస్తారని తెలిపారు. దీనికి ఏర్పాట్లు పక్కాగా పూర్తి చేయాలన్నారు. రాడిసన్ బ్లూ హోటల్‌లో నిర్వహించనున్న జీసీసీ (గ్లోబల్ క్యాపబుల్ సెంటర్) బిజినెస్ సమ్మిట్‌లో కూడా పాల్గొంటారన్నారు. భద్రతా చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులకు సూచించారు.